




# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 07-10-2020 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 25 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## ప్రధానితో జగన్ భేటీ

**రాష్ట్ర విభజన హామీలు, తదితర 17 అంశాలపై ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి నివేదించినట్లు అధికార వర్గాలు వెల్లడి**



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం ముగిసింది. దాదాపు 50 నిమిషాల పాటు నిమిషాల పాటు ఈ భేటీ కొనసాగింది. రాష్ట్ర అభివృద్ధి అజెండాగా ఈ సమావేశం జరిగింది. రాష్ట్రానికి కేంద్రం అందించాల్సిన సహాయం, చెల్లిం చాల్సిన బకాయిలు, రాష్ట్ర విభజన హామీలు, తదితర 17 అంశాలపై ప్రధాన మంత్రికి ముఖ్యమంత్రి నివేదించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ప్రధాని మోదీతో భేటీ అనంతరం కేంద్ర జల శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి జల వివాదాల పరిష్కారానికి వీలుగా కేంద్ర జల శక్తి శాఖ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సీఎం జగన్ వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభా పక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి, లోక్‌సభలో పార్టీ విప్ మార్గాని భరత్, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు ఉన్నారు.

**సీఎం జగన్‌ను కలిసిన పీఎన్‌బీ సీఈవో**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈవో మల్లికార్జున్ రావు, సీజీఎం చందర్ ఖురానా మర్యాదపూర్వకంగా కలిశారు.

## పోర్టు సిబ్బంది కృషితోనే ఉత్తమ ఫలితాలు

- రికార్డు స్థాయిలో 2019-20 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా
- 11శాతం ఆధిక్యంతో విశాఖ పోర్టు చరిత్రలో తొలిసారి
- కాలుష్య నివారణ, ఉద్యోగుల భద్రతకే తొలి ప్రాధాన్యత
- పోర్టు చైర్మన్ కె.రామ్మోహనరావు వెల్లడి




విశాఖపట్నం : విశాఖ పోర్టు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సరుకు రవాణాలో రికార్డును నెలకొల్పిందని పోర్టు చైర్మన్ కె. రామ్మోహనరావు తెలిపారు. పోర్టు స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. 2019-2020 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు 72.72 మిలియన్ టన్నుల రికార్డు స్థాయి సరుకును రవాణా చేసిందన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 65.30 మిలియన్ టన్నులతో పోల్చుకుంటే ఇది 11 శాతం అధికమని వివరించారు. కొవిడ్ ప్రభావం ఉన్నప్పటికీ.. పోర్టు అధికారులు, సిబ్బంది కృషి వల్లే ఇది సాధ్యమైందని - పోర్టు చైర్మన్ కె. రామ్మోహనరావు ఆనందం వ్యక్తం చేశారు.

**సరుకు రవాణా పై కోవిడ్-19 ప్రభావం**

భారత దేశంలోని మేజర్ పోర్టులు అన్నీ కలిపి 2020 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మాసం వరకు 245 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేశాయి. ఇదే 2019 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 294 మిలియన్ టన్నుల సరుకును 12 మేజర్ పోర్టులు కలిసి చేశాయి. గత ఏడాది ఇదే సమయానికి (ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగం) సరుకు రవాణా తో పోల్చుకుంటే 16.5 శాతం తక్కువగా నమోదైంది విశాఖపట్టణం పోర్ట్ ట్రస్ట్ 2020-21 ఆర్థిక

తరువాయి 6లో..

## జలవివాదాలపై పూర్తిగా చర్చించాం

- రెండు రాష్ట్రాల మధ్య వివాదాలను పూర్తిగా చర్చించాం
- ఏకాభిప్రాయంతో పరిష్కారానికి వచ్చాం
- అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయాలను వెల్లడించిన కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్






న్యూఢిల్లీ: రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలను పూర్తిగా చర్చించామని, చాలా అంశాలపై ఏకాభిప్రాయంతో ఒక పరిష్కారానికి వచ్చామని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. మంగళవారం జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కృష్ణా, గోదావరి నదులపై ఏ ప్రాజెక్టులు కట్టాలన్నా.. వాటికి అనుమతులు ఇచ్చే అధికారం అపెక్స్ కౌన్సిల్‌దేనని షెకావత్ స్పష్టం చేశారు. "కృష్ణా, గోదావరి రివర్ బోర్డుల పరిధిని నోటిఫై చేయడంపై చర్చ జరిగింది. ఆరేళ్లుగా వివాదాల కారణంగా వీటిని నోటిఫై చేయలేదు. ఈ రోజు రెండు రాష్ట్రాల సీఎంల ఏకాభిప్రాయంతో వీటిని నోటిఫై చేస్తున్నాం. కృష్ణా, గోదావరి నదులకు సంబంధించిన కొత్త ప్రాజెక్టులపై డీపీఆర్‌లను సమర్పించడానికి

తరువాయి 6లో..

## తప్పుడు కథనాలపై సైబర్ పోలీసులకు గీతం ఫిర్యాదు




సాగర్‌నగర్ : గీతంతో సహ దేశవ్యాప్తంగా 123 కాలేజీలకు యూజిసి ఇచ్చిన యూనివర్సిటీ హోదాను రద్దుచేసినట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని గీతం రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పై సోషల్ మీడియాలో తప్పుడు, నిరాధార, సత్యదూర కథనాలను ప్రసారం చేస్తున్న వారిని గుర్తించి శిక్షించాలని విజ్ఞప్తి చేస్తూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇవి తప్పుడు కథనాలని పలువురు వాటిని యధాతథంగా ఇతరులతో పంచుకోవడం వల్ల అది గీతం ప్రతిష్ఠ, గౌరవాలకు భంగం కలిగించడంతో పాటు పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తోందని పేర్కొన్నారు.

దీనిపై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి, దురుద్దేశ పూరితంగా తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి, ఐపిసి1860, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000 ప్రకారం శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఇక మీదట వారు అనవసర, తప్పుడు కథనాలను ప్రచురించకుండా, గీతం ప్రతిష్ఠను భంగపరచకుండా చూడాలని కోరారు.

దేశంలోని డీమ్డ్ విశ్వవిద్యాలయాలు తమ పేరు చివరన యూనివర్సిటీ అని వినియోగించేవి. దీనిపై గౌరవ సుప్రీంకోర్టు చేసిన సూచినల మేరకు గత మూడు సంవత్సరాలుగా డీమ్డ్ టూ బీ యూనివర్సిటీగా మార్పు చేయడం జరిగింది. గీతం జారీచేసే అధికారిక ధ్రువపత్రాలలో సయితం గీతం డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ అనే వాడటం జరుగుతోంది. పలు దినపత్రికలకు జారీచేసిన ప్రకటనలను గమనించినా ఈ వాస్తవం బోధపడుతుంది.


అయితే దేశంలోని కొన్ని డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఇంకా పాత పద్ధతినే అనుసరిస్తూ ఉండడంతో యూజిసి మరోమారు ఈ ఏడాది మే 27న సర్క్యులర్ జారీచేసింది. దీనిని పూర్తిగా అర్థం చేసుకోని కొందరు, ఆ సర్క్యులర్‌ను వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారు.

ఈ విధమైన నిర్లక్ష్యపు, నిరాధార వార్తలను ప్రచారం చేయడం వెనుక గల దురుద్దేశాలను ప్రజలు, విద్యావంతులు అర్థం చేసుకోగలరని భావిస్తున్నాము. ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా సంస్థలపై సోషల్ మీడియాలో వచ్చే ఇటువంటి అసత్య కథనాల్లోని నిజానిజాలను నిర్ధారించుకోవడానికి యూజిసి, ఏఐసిటీఈ వంటి చట్టబద్ధ నియంత్రణ సంస్థలనో లేదా విశ్వవిద్యాలయ వర్గాలనో సంప్రదించగలరని విజ్ఞప్తి చేస్తున్నాం.






## భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్




స్టాక్‌హోం: ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో ముగ్గురిని నోబెల్ వరించింది. విశ్వంలోని అత్యంత అరుదైన అంశమైన కృష్ణబిలంపై పరిశోధనలకు గానూ శాస్త్రవేత్తలు రోజర్ పెన్రోస్, రిన్‌హార్డ్ గెంజెల్, ఆండ్రియా గెజ్‌లకు నోబెల్ పురస్కారం ప్రకటించారు. అయితే ఇందులో రోజర్ పెన్రోస్‌కు సగం పురస్కారాన్ని ఇవ్వగా.. మిగతా సగాన్ని రిన్‌హార్డ్, ఆండ్రియాలు పంచుకోనున్నారు.

కృష్ణబిలం, పాలపుంతల రహస్యాలను తెలుసుకునేందుకు ఈ శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేశారు. ఈ

తరువాయి 2లో..

## ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదల

### ఏపీ ఈసెట్‌లో 96.12 శాతం ఉత్తీర్ణత

విజయవాడ : ఇంజనీరింగ్ డిప్లొమో పూర్తిచేసిన విద్యార్థులు తదుపరి ఉన్నత సాంకేతిక విద్యన కొనసాగించేందుక వీలుగా నిర్వహిస్తున్న ఏపీ ఈసెట్-2020 ఫలితాలు మంగళవారం విడుదల అయ్యాయి. విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఫలితాలను విడుదల చేశారు. విద్యా శాఖ స్పెషల్ సిఎస్ సతీష్ చంద్ర, ఎపి ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, సెక్రటరీ సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 14న రాష్ట్రంలోని 79 కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా ఈ పరీక్షలు నిర్వహించారు. 31,891 మంది పరీక్షలకు హాజరుకాగా, 30,654 మంది క్వాలిఫైఅయ్యారు. 96.12 శాతం ఉత్తీర్ణత

తరువాయి 2లో..

## ఆక్రమణలు తొలగింపులో రెవెన్యూ శాఖ జాప్యం

భీమునిపట్నం: భీమిలి మండలం లోని టి.నగరపాలెము పంచాయతీ నోటీసులు అంటించి 13 నెలలు గడుస్తున్నా కూడా ఆక్రమణలు తొలగింపులో రెవెన్యూశాఖ అధికారులు జాప్యం చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తగరపువలస గ్రామ సర్వే నంబర్ 15 లో 3.67 ఎకరాల పోరంబోకు ప్రభుత్వ భూమి లో 0.30 సెంట్ల భూమిని ఆక్రమించి ప్రహరీ గోడ కట్టిన మాలకొండయ్యకు సదరు స్థలం నుండి వైదొలగాలని లేని పక్షంలో స్థలం స్వాధీనం చేసుకుంటామని స్థానిక తహశీల్దార్ గత ఏడాది ఆగస్టు లో నోటీసులు జారీచేశారు. అయితే 13 మాసాలు గడిచినను రెవెన్యూశాఖ సదరు భూమి వంక చూడకపోవడం పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇందులో ఏదో లాబీయింగ్ జరిగి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ స్థలంలో పేదవారు నిర్మించుకున్న ఇంటికి రాత్రికి నోటీసు ఇచ్చి ఉదయాన్నే కూల్చివేసే అధికారులు ఈ విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని వారు ప్రశ్నిస్తున్నారు.

అవినీతికి తావులేదని చెప్తున్న మంత్రి అవంతి శ్రీనివాసరావు దీనిపై దృష్టి సారించి అధికారులపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుచున్నారు.

## నాగవంశం కార్పొరేషన్ ఛైర్మన్ పదవి తనకు ఇప్పించాలి

భీమునిపట్నం : బొడ్డు అప్పలనాయుడు భార్య కొండకు నాగవంశం కార్పొరేషన్ అభ్యర్థి గా ప్రకటిస్తే బాగుంటుందనీ ఎ.వి.ఎన్ కళాశాల మాజీ లెక్చరర్ రాంభక్త కన్నారావు అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ బొట్టు అప్పలనాయుడు నాగవంశీయులకు ప్రత్యేక కార్పొరేషన్ రావడానికి చాలాకృషి చేసారనీ అన్నారు. అంతేకాకుండా వైఎస్సార్ పార్టీ నాయకులుతో అనుబంధం కూడా ఉందని తెలిపారు. ఇలాంటి వారికి పదవి ఇచ్చినట్లయిన వైకాపా పార్టీ అభివృద్ధికోసం పాటుపడతారనీ అన్నారు. అంతేకాకుండా మంచివ్యక్తనీ, అందరిలో తలలో నాలుకగా ఉంటారనీ చెప్పారు. ఇలాంటి వ్యక్తి పార్టీకి ఎంతైనా అవసరమేననీ అన్నారు.నాగవంశం కార్యదర్శి బొట్టు అప్పలనాయుడు మాట్లాడుతూ పద్మనాభం మండలం లోని మద్ది గ్రామంలో పుట్టి, విజయవాడ వ్యాపార పరంగావెళ్ళినట్లు తెలిపారు.

అయినా నాగవంశీయుల గురించి ఎంతో కృషి చేసిన ట్లు చెప్పారు. సి.ఎం జగన్మోహన్ రెడ్డి నన్ను నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ పదవి నాభార్యకు ఇప్పిస్తే వైఎస్సార్ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

## ఏపీ పురోహిత బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యునిగా అందుకూరి కిరణ్‌కుమార్ శర్మ



గాజువాక: ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడుగా గాజువాక ప్రాంతానికి చెందిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కోఆర్డినేటర్ అందుకూరి కిరణ్ కుమార్ శర్మను నియమితులయ్యారు. అంతేకాకుండా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శారదా పీఠంలో మంగళవారం జరిగిన బ్రహ్మయజ్ఞం కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్రస్వామీ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పురోహితం బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించేందుకు, బ్రాహ్మణ జాతి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అర్చక పురోహితుల సమస్యలను జిల్లా కార్యవర్గం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో చొరవ చూపిస్తానని హామీ ఇచ్చారు.

# చిక్కుల్లో చక్కెర పరిశ్రమ

**- రైతులకు చెల్లించాల్సిన రూ.15,683 కోట్లు బకాయిలు - మూతపడే దిశగా మరికొన్ని పరిశ్రమలు**

*- డాక్టర్ ఎం.ఆర్.ఎన్.వర్మ*

విశాఖపట్నం : దేశంలో చక్కెర పరిశ్రమ రోజురోజుకూ చతికిలపడుతోంది. సుదీర్ఘకాలం నుంచి సాంప్రదాయంగా కొనసాగుతున్న చక్కెర పరిశ్రమ నాటి తీపి జ్ఞాపకాలను మరిచేలా నేడు చేదు అనుభవాలను ఎదుర్కొంటోంది. ఈ రంగంపై ఆధారపడిన చెరకు రైతులు, కార్మికులు అనునిత్యం సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా తక్కువ దిగుబడి, క్రషింగ్ చేయడం స్వల్పంగా వుండడం, ఉత్పత్తిలో హెచ్చు తగ్గులు, రికవరీ రేటు తక్కువగా వుండడం, ప్రొడక్షన్ ధర ఎక్కువగా వుండడం వంటి పరిణామాలతో ఈ రంగం కుదేలవుతోంది. పాతబడిన, మరమ్మతులకు గురైన యంత్రాలను వినియోగించడం వల్ల కూడా సత్ఫలితాలు సాధించడానికి వీలు పడడం లేదు. చక్కెర పరిశ్రమలు నడపడంలో ఎదురవుతున్న ఒడిదుడుకుల కారణంగా రైతులకు సకాలంలో చెల్లింపులు జరగడం లేదు. దీంతో అప్పు చేసి చెరకు పండిస్తున్న రైతులు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

దేశవ్యాప్తంగా రూ.15,683 కోట్ల బకాయిలు!

ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి దేశవ్యాప్తంగా చక్కెర మిల్లులు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.13 వేల కోట్లుగా వుందని తెలుస్తోంది. పాత బకాయిలతోకలిపి చూస్తే రూ.15,683 కోట్లు చెల్లించాల్సి వున్నట్టు చెబుతున్నారు.

ఇలా ప్రతిఏటా బకాయిలు పేరుకుపోవడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. 2019-20 చక్కెర సీజన్ నాటికి రూ.75,085 కోట్లు చెల్లించాల్సి వుండగా రూ.62,591 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.12,994 కోట్లు చెల్లించాల్సి వుంది. 2016-17 చక్కెర సీజన్ నాటికి రూ.1899 కోట్లు బకాయి వుండగా 2017-18 నాటికి రూ.242 కోట్లు, 2018-19 నాటికి రూ.548 కోట్లు, 2019-20 నాటికి రూ.12,944 వుండగా మొత్తం రూ.15,683 కోట్లు బకాయి చెల్లించాల్సి వుంది. ఇలా నిరంతర ప్రక్రియగా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో రైతులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. 11 చక్కెర మిల్లులు కలిగి వున్న ప్రతిష్టాత్మకమైన బజాజ్ గ్రూప్ కూడా రూ.5339 కోట్లు రైతులకు చెల్లించాల్సి వుండగా 3378 కోట్లు చెల్లించి ఇంకా రూ.2961 కోట్లు చెల్లించాల్సి వున్నట్టు తెలుస్తోంది. మరోపక్క గతేడాది చెరకు ధర నిరుత్సాహంగా వుండడంతో బకాయిలు చెల్లించలేకపోతున్నామని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. చెరకు అమ్ముకునే రేట్లు పెంచమంటే ప్రభుత్వం నెలలపాటు మీనమేషాలు లెక్కిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమ వర్గాలకు, రైతులకు ఊతమిచ్చే విధంగా ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందించి చక్కెర పరిశ్రమ గాడిన పడేలా చూడాల్సి వుండగా ఆ దిశగా సరైన ప్రయత్నాలు జరగడం లేదని పరిశ్రమ వర్గాలు, సంఘాలు ఆరోపిస్తున్నాయి.

మూతపడే దిశగా చక్కెర పరిశ్రమలు

ఇండియన్ సుగర్ మిల్స్ అసోసియేషన్ (ఇస్మా) సమాచారం మేరకు దేశంలో 60 లక్షల టన్నుల చక్కెర ఎగుమతికి అవకాశం వున్నప్పటికీ కోవిడ్ నేపథ్యంలో కేవలం 30 లక్షల టన్నులే ఎగుమతి జరిగినట్టు తెలుస్తోంది. ఇదిలా వుండగా దేశ వ్యాప్తంగా 527 చక్కెర పరిశ్రమలుండగా 2019-20 నాటికి 457 పరిశ్రమలు మాత్రమే నడుస్తున్నాయి. అయితే క్రషింగ్ తక్కువ జరగడంతో వందకు పైగా పరిశ్రమలు మూతపడిన నేపథ్యంలో 2021 నాటికి మరో 173 పరిశ్రమలు మూతపడడం ఖాయమని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చెరకు రైతులు, కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. నాణ్యత తగ్గి దిగుబడి లేక లాభాలు రావడం లేదనే సాకులతో కొన్ని పరిశ్రమల యజమానులు కార్మికులకు మొండి చేయి చూపుతున్నారు. మరోపక్క సకాలంలో రైతులకు కంపెనీలు సొమ్ము చెల్లించకపోవడంతో వడ్డీల భారంతో చెరకు రైతులు నలిగిపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం దారుణమని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.



చెరకు పరిశ్రమ అభివృద్ధి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అయితే ఆచరణలో చర్యలు ఏమాత్రం కనబడడం లేదు. చెరకు సాగును పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించాలి. లేనట్లయితే రాష్ట్రంలో చెరకు పరిశ్రమ కనుమరుగయ్యే అవకాశం వుంది.

**- కె.వి.వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం**



రికవరీ రేటు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య వల్ల చెరకు రైతుకు తీరని నష్టం జరుగుతుంది. ధర నిర్ణయానికి ప్రధానమైన రికవరీ రేటును 9.5 శాతం నుంచి 10 శాతానికి పెంచడం ద్వారా రైతులకు అన్యాయం జరిగింది. ఒకవేళ 10 శాతం రికవరీ రేటు సాధించలేకపోతే చెరకు ధర పడిపోయి రైతుకు నష్టం ఏర్పడుతుంది. మరోపక్క రాష్ట్రంలో కూడా చెరకు రైతులకు అన్యాయమే జరుగుతోంది. రైతుల బాధలు తీర్చే దిశగా ఆలోచిస్తూ ప్రభుత్వం నియమించిన గురవారెడ్డి కమిటీ, ముగ్గురు మంత్రులతో కూడిన ఉపసంఘం వల్ల ఇప్పటివరకు రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు.

**- బుడితి అప్పలనాయుడు, రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ చెరకు రైతు సంఘం**

## ఏషియన్ పెయింట్స్ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు



అచ్యుతాపురం : మత్స్యకార గ్రామమైన పూడిమడకలో ఏషియన్ పెయింట్స్ కంపెనీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన ఆసుపత్రిని యలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు ( కన్నబాబురాజు), డీసీసీబి చైర్మన్ యు సుకుమార వర్మ (తేజ) మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాట్లాడుతూ ఏషియన్ పెయింట్స్ ఆసుపత్రి ఉచిత వైద్య సేవలను పూడిమడక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ కంపనీ ప్రతినిధుల, వైసీపీ నాయకులు కోనబుజ్జి, నర్మాల కుమార్, పిన్నంరాజు వాసు, దేశంశెట్టి శంకర్, చేపల వెంకటరమణ, చేపల శ్రీరాములు, వాసుపల్లి శ్రీనువాసురావు, చోడిపల్లి అప్పారావు, పోలవరపు పారునాయుడు, మేరుగు అప్పల నాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై విచారణ



విచారణ చేపడుతున్న దృశ్యం

గొలుగొండ : గొలుగొండ మండలం లింగందొరపాలెం గ్రామ పంచాయతీ గింజర్తి గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పథకం పై గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందంటూ గ్రామస్థులు గత కొద్ది రోజుల కిందట సబ్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో గొలుగొండ ఎంపిడిఓ డేవిడ్‌రాజు, ఏపిఓ సుప్రియ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ విఆర్‌పై విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకం పై గ్రామసభ మొత్తం జరుగుతున్న విషయాలను వీడియో కవరేజ్‌తో అధికారులు నిర్వహించారు. ఇరుపక్షాల వారు గొడవలు పడతారని ముందస్తు సమాచారంతో పోలీసులు కూడా సమాచారం అధికారులు అందజేశారు.

మొదటి పేజీ తరువాయి

# జలవివాదాలపై పూర్తిగా చర్చించాం

ఇరురాష్ట్రాల సీఎంలు ఒప్పుకున్నారని" షెకావత్ వెల్లడించారు. కృష్ణా, గోదావరి రివర్ బోర్డులకు ముందుగా డీపీఆర్‌లను సమర్పించిన తర్వాతనే కొత్త ప్రాజెక్ట్‌ల ప్రతిపాదనలు తేవాలని చర్చించామని ఆయన పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాల పంపిణీకి సంబంధించి సమగ్రమైన ప్రణాళికపై చర్చ జరిగిందని, కృష్ణా రివర్ బోర్డ్‌ను హైదరాబాద్ నుంచి ఏపీకి తరలించేందుకు ఇరురాష్ట్రాలు ఒప్పుకున్నాయని చెప్పారు. జల పంపిణీ వివాదంపై సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని కేసీఆర్ ఒప్పుకున్నారని తెలిపారు. ఆ తర్వాత ఈ అంశంపై ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని చెప్పామని షెకావత్ తెలిపారు. త్వరలో పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తామని ఆయన పేర్కొన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం (రాష్ట్ర విభజన చట్టం) ప్రకారం "అపెక్స్ కౌన్సిల్" ఏర్పడిందని, నాలుగు సంవత్సరాల అనంతరం ఈ సమావేశం జరిగిందని షెకావత్ అన్నారు. 2016 లో తొలిసారి అప్పటి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమా భారతి నేతృత్వంలో "అపెక్స్ కౌన్సిల్" సమావేశం జరిగిందన్నారు. కృష్ణా, గోదావరి నదుల నీటి పంపకం, వివాదాల పరిష్కారం ఈ కౌన్సిల్ బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశం చాలా సుహృద్భావ వాతావరణంలో జరిగిందని, అన్ని సమస్యల పరుష్కర కోసం చాలా విపులంగా చర్చించామని ఆయన తెలిపారు. ఇద్దరు ముఖ్య మంత్రులూ సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నారని షెకావత్ వెల్లడించారు.

అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఐదు కీలక నిర్ణయాలు..

- కేఆర్ఎంబీ,జీఆర్ఎంబీ బోర్డుల పరిధి నోటిఫై చేస్తున్నాం - కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లు పంపడానికి అంగీకారం - న్యాయ సలహా తర్వాత కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీకి నూతన ట్రిబ్యునల్ ఏర్పాటు పై నిర్ణయం -సుప్రీం కోర్టు నుంచి కేసు ఉపసంహరణ చేస్తే నది జలాల పంపిణీ పై ట్రిబ్యునల్ ఏర్పాటు. కేసు ఉపసంహరణకు సీఎం కేసీఆర్ అంగీకారం - కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయం ఆంధ్రాకు తరలింపు

## భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

క్రమంలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కనుగొన్న సాపేక్ష సిద్ధాంతమే కృష్ణబిలాలు ఏర్పడటానికి మూలమని రోజర్ పెన్రోస్ గుర్తించారు. కృష్ణబిలాలు నిజంగా ఉన్నాయనే విషయాన్ని ఐన్‌స్టీన్ నమ్మలేదు. అయితే దాన్ని రోజర్ తన పరిశోధనలతో నిరూపించారు. ఇక పాలపుంత కేంద్రంలో దుమ్ము, ధూళి, ఇతర వాయువులతో కూడిన దట్టమైన మేఘాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు రిన్‌హార్డ్ గెంజెల్, ఆండ్రియా తమ పరిశోధనల ద్వారా తెలియజేశారు. ఒక అదృశ్య, భారీ వస్తువు మన గెలాక్సీ మధ్యలో ఉన్న నక్షత్రాల కక్ష్యలను నియంత్రిస్తుందని వీరు గుర్తించారు. ఇందుకు గానూ.. ఈ ఏడాది వీరికి నోబెల్ పురస్కారం ప్రకటించారు.

ఇక భౌతిక శాస్త్రంలో నోబెల్ అందుకున్న నాలుగో మహిళ ఆండ్రియా గెజ్. డోనా స్ట్రిక్‌ల్యాండ్, మరియా గోపెర్ట్ మేయర్, మేరీ క్యూరీ తర్వాత ఈ ఘనత సాధించిన మహిళగా ఆమె రికార్డు సృష్టించారు.

## ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదల

### ఏపీ ఈసెట్‌లో 96.12 శాతం ఉత్తీర్ణత

సాధించారు. క్వాలిఫై అయినవారిలో 25160 మంది పురుషులు, 6731 మంది మహిళలు ఉన్నారు. **సబ్జెక్టుల వారీగా ర్యాంకర్లు వీరే**

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ : గొర్తి వంశీకృష్ణ, (అనంతపురం )
బీఎస్సీ మేథమెటిక్స్ : శివాల శ్రీనివాసరావు (శ్రీకాకుళం)
సిరామిక్ టెక్నాలజీ: తూతిక సంతోష్ కుమార్ (ప్రకాశం జిల్లా)
కెమికల్ ఇంజనీరింగ్: ముస్తాక్ అహ్మద్ (గుంటూరు)
సివిల్ ఇంజనీరింగ్: బానోతు అంజలి (ఖమ్మం)
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ : కోడి తేజ (కాకినాడ)
ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్: నరేష్ రెడ్డి ( కడప)
ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్: కుర్రా వైష్ణవి ( గుంటూరు జిల్లా రేపల్లే)
ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్టుమెంటెరషన్ ఇంజనీరింగ్ : ఫృద్వీ ( రంగారెడ్డి)
మెకానికల్ ఇంజనీరింగ్ : గరగా అజయ్ ( విశాఖపట్టణం)
మెటలర్జికల్ ఇంజనీరింగ్ : వరుణ్ రాజు ( విజయనగరం)
మైనింగ్ ఇంజనీరింగ్ : బానాల వంశీకృష్ణ (ములుగు)
ఫార్మసీ: అశ్లేష్ కుమార్( కృష్ణా జిల్లా చల్లపల్లి), శాంతి ( శ్రీకాళుళం జిల్లా మందస)

# ల్యాండ్ మాఫియా నుంచి కాపాడండి

**-మత్పశ్రీనగర్ హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సోసైటీ భాదితుల మొర**



మాతృశ్రీ పంచాయితీ లేఅవుట్

గాజువాక : కష్టార్జితంతో కొన్న మా స్థలాలను మాకు చెంద కుండా సొసైటీ ముసుగులో స్థలాలను నొక్కేస్తున్న ల్యాండ్ మాఫియా బారి నుంచి రక్షించాలని మతృశ్రీనగర్ హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ భాదితులు ప్రభుత్వానికి మొరపెడు తున్నారు. గత ప్రభుత్వ హాయంలో జరగని న్యాయం వైకాపా ప్రభుత్వంతో జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్ పై పూర్తి నమ్మకంతో మాతృశ్రీనగర్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ బాధితులు ఎదురు చూస్తున్నారు. మాతృశ్రీనగర్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ లీలలపై వరుస కథనాలు వెలువడుతున్న విషయం తెలిసిందే. బాధితులు ఇప్పటికే అటు ముఖ్యమంత్రికి, కొంతమంది నగరపోలీస్ కమీషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్దపడుతున్నతెలిసింది. అయితే ఇందులో ప్రధాన సూత్రదారుడుపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.

**మోసం జరిగిందిలా...........** 1980లో విశాఖపట్నం వడ్లపూడి గ్రామపంచాయితీ కూర్మన్నపాలెంలో కోడూరు చిట్టిబాబు అధ్యక్షులుగా 18సభ్యులతో శ్రీ మాతృశ్రీ కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఏర్పడింది. అమాయలకు అల్పాదాయంగల సభ్యులకు పంచాయితీ అప్రూవల్‌తోకూడిన 493 ఇళ్ళ స్థలాలను అమ్మి రిజిస్ట్రేషన్ చేసారు. అయితే ఏ ఒక్కరికీ స్థలాలను స్వాధీనం చేయకుండా, స్థలాలన్ని అమ్మిన తరువాత అందజేస్తామని నమ్మించారు. ఆ తరువాత డవల్మంట్ చార్జీలతో బెదిరించి, పదేపదే నోటీసులు ఇచ్చి స్థలం ధరకన్నా అధికధరలను వసూలుకు పాల్పడ్డారనేది బాధితుల ఆరోపణ. పక్కా రోడ్లు, పక్కా మురుగు కాలువలు వేస్తామని చెప్పి కోట్లు దండుకుంటూ, అమాయక ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసి పదేపదే వూడా పేరుతో ప్లాన్ మార్పులు చేసినట్లు నమ్మించి అందినకాడికి దోచుకున్నట్లు బాధితులు వాపోతున్నారు. సర్వేనెం.25పిలో 19స్థలాలు, సర్వేనెం.26లో సుమారు 60స్థలాలు, సర్వేనెం.27లో 65స్థలాలు మారు రిజిస్ట్రేషన్ చేసి అసలు లబ్దిదారులను మోసం చేసి దోకుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితులు చాలామంది స్థానికేతరులు కావడంతో సొసైటీ ఆటలకు అడ్డులేకుండా పోయింది. 1980లో రిజిస్ట్రేషన్ చేసిన స్థలాలకు పలుమార్లు డవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసి, ఇప్పుడు స్థలాలపై కొర్రి వేసి, ప్రభుత్వస్థలాలని సొసైటీ పేర్కోనడం చట్టరీత్యా నేరమని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవి ప్రభుత్వ ల్యాండ్స్ అని పంచాయితీ అధికారులకు తెలియదా? అవి ప్రశ్నిస్తున్నారు. న్యాయంకోసం ముఖ్యమంత్రిని వేడుకుంటున్నట్లు బాధితులు తెలిపారు.

**పాత్రకేయులను మట్టుపెట్టేందుకు కుట్ర....?** : అధికార పార్టీకి చెందిన నాయకుడు తెరవెనుక పాత్రవహిస్తు మాతృశ్రీనగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీని అడ్డం పెట్టుకొని, అమాయకులను, అల్పాదాయ వర్గాలను ముంచి కోట్లు కుమ్మరించుకున్న తీరుపై వరుసకథనాలు వస్తున్న నేపద్యంలో కథనాలకు కారణమైన పాత్రికేయులను మట్టుపెట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. ఇప్పటికే కొంతమంది అనుచరులతో మంతనాలు కూడా జరిపి, సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. నేర చరిత్రలో పూర్తిగా మునిగిన ఆసామి అడ్డం వచ్చినవారిని ఎంతటివారినైన తొలగించడంలో సిద్ధహస్తుడనే వాదన లేకపోలేదు. ఇదిలా వుంటే పార్టీ అధిష్ఠానం ఈ వ్యవహారం పై దృష్టిపెట్టినట్లు తెలిసింది. పార్టీకి మచ్చవచ్చేవిధంగా ఉన్న ఈ వ్యవహారంపై ఆచితూచి అడుగులు వేసేందుకు నగరానికి చెందిన పెద్దతలకాయ ఉన్నట్లు సమాచారం.

### 50వ వార్డులో కొండచరియలు విరిగి మృతి చెందిన బాలిక కుటుంబానికి

# ఆర్థిక సాయం అందించిన కె.కె.రాజు





మాధవధార : గత కొద్దిరోజులుగా పడుతున్న వర్షానికి విశాఖ ఉత్తర నియోజకవర్గం 50వార్డు సాయిరామ్ నగలో కొండ చరియలు విరిగి మీద పడడంతో 3సంవత్సరాలు బాలిక (గంగోత్రి) మృతి చెందింది.

ఈ విషయం తెలిసిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సంఘటన స్థలానికి వెళ్లి బాధిత కుటుంబానికి 20వేలు రూపాయలు చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో 50వార్డు అభ్యర్థి వి.ప్రసాద్,అనిల్ కుమార్ రాజు,అల్లు శంకరావు,నీలి రవి, షేక్ జుబైర్, సబ్బవరపు శ్రీను, మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ స్కీం పై స్పష్టమైన వైఖరి ఇవ్వాలి

### - పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు



గోపాలపట్నం : రెండు సంవత్సరాలు గడుస్తున్నా గృహనిర్మాణ స్కీం పైన స్పష్టమైన వైఖరి ఇవ్వకుండా , లబ్దిదారులను ఆందోళన కలిగించే విధంగా చేయాలి ఉన్నాయని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పిజివిఆర్.నాయుడు గణబాబు పేర్కొన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఏపీటీఐటీసీఓ, పీఎమ్ వై స్కీమ్లు ద్వారా ఎంతో మంది పేద ప్రజలు సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు డిడి లు కట్టి అందుబాటులో ఉన్న మూడు రకాల ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు , రాజకీయాలకు అతీతంగా ఏ నియోజకవర్గం ప్రజలకు అక్కడి ఉపాధి అవ కాశాలు పోకుండా అదే ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది టాటా హౌసింగ్ సంస్థ ద్వారా ఈ నిర్మాణాలు జరిగాయి -పశ్చిమ నియోజక వర్గం పరిధిలో మూలగడం, పద్మనాభపురం, అచ్చం నాయుడులోవ వంటి ప్రాజెక్టులు తో పాటుగా స్లం- క్లీరెన్స్ ప్రాజెక్టులలో భాగంగా రాజీవ నగర్, గౌరీనగర్, ముత్యమంబ కాలనీ, పైడిమాంబ కాలనీ తదితర ప్రాంతాలలో లబ్దిదారులకు డిడి తో పాటు, నిర్మాణ ప్రాంతంలో జీవీఎంసీ కమిషనర్ ఆధ్వర్యంలో లాటరి పద్ధతిలో అల్లొట్మెంట్ లెటర్ కూడా అందజేయడం జరిగింది. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల హామీ కింద ఇల్లు ఉచితంగా కట్టిస్తాం అని చెప్పారు అందుకుగాను డిడి లు తిరిగి ఇస్తాము అని స్పష్టంచేసినా స్వాగతిస్తాం బీ ఐతే డిడి లు ఇస్తాము అని చెప్పి, మల్లి లబ్దిదారు లను తిరిగి ఎంపిక చేస్తాం అని కొత్త వైఖరి సబబు కాదు. ప్రజలు కట్టిన డిడిలు, కేంద్రనిధులతో నిర్మించ బడిన ఇల్లు ఇవి. ఇప్పటికి ఐన అధికారి కంగా ఒక స్పష్టమైన వైఖరి తీసుకొని, ప్రజలను ఆందో ళనకు గురి చేయకుండా, లబ్దిదారులను ఆదు కోవాలని డిమాండ్ చేస్తున్నామని గణబాబు కోరారు.

### పూడిమడక తీరప్రాంతంలో

## భూమిలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



అచ్యుతాపురం : పూడిమడక తీరప్రాంతంలో భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు చేపల తాతయ్య అన్నారు. మంగళవారం ఆయన పూడిమడకలో సమస్యలపై యలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణ మూర్తి రాజుకి వినతిపత్రం అందజేశారు.పెండింగ్ ప్యాకేజీలను వెంటనే ఇప్పించాలని, అర్హులైన వారం దరికి ఇల్లు స్థలాలు అందించాలని, పెండింగ్ లో ఉన్న వేటనిషేద భృతి లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారని అన్నారు.

### జి అడ్వాన్స్డ్- 2020 ఫలితాలలో

## విశాఖ శశి కాలేజ్ ప్రభంజనం

భీమునిపట్నం : సోమవారం వెలువడిన జి అడ్వాన్స్ డ్ - 2020 ఫలితాలు లో విశాఖపట్నం, సంగివలసలో ఉన్న శశి క్యాంపస్ విద్యార్థులు ప్రభంజనాన్ని సృష్టించారనీ శశి విద్యార్థులు చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల్ కృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ తెలిపారు. వివిధ కేటగిరీలకు సంబంధించి ఆలిండియా లో వి.విష్ణువర్ధన్ 351ర్యాంకు ,ఎ.నిఖిల్ సాయి 430 ర్యాంకు, జె.గణేష్ 644, ఎన్.అవినాష్ 888, ఎ.అభ్యుదయ్ 993 ర్యాంకు సాధించారని చెప్పారు. ఈ ఘనత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు, అధ్యాపక బృందానికి, శశి విద్యా సంస్థ ల సెక్రటరీ & కరస్పాండెంట్ క్రాంతి సుధ అభినందనలు తెలియజేశారు.

### భౌతికశాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థిని

## శీలాక కిరణ్మయికు వర్సిటీ డాక్టరేట్



ఏయూ : ఆంధ్ర విశ్వ విద్యాలయం భౌతికశాస్త్ర విభాగ పరిశోధక విద్యార్ధిని శీలాక కిరణ్మ యికు వర్సిటీ డాక్టరేట్ లభించింది. భౌతిక శాస్త్ర ఆచార్య కె.నిరంజన్ మరియు ఆచార్య డిఎస్ వివిడి. ప్రసాద్ పర్యవేక్ష ణలో 'స్టడీ ఆఫ్ ఐనోస్ఫి యరిక్ ఎఫ్- రీజియన్ పెరామీటర్స్ ఎండ్ డిపిఎస్ టిఇసి ఓవర్‌లలో లాటిట్యూడ్ స్టేషన్, వాల్తేరు (17.7౦ఉ) ఎండ్ కంపారిసన్ విత్ ఐఆర్ఐ అనే అంశంపై జరిపిన పరిశోధ నకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఈ సంద ర్భంగా కిరణ్మయిని విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు. మంగళ వారం వర్సిటీ విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి నుండి డాక్టరేట్ స్వీకరించారు.

# భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హెూమం



లక్ష్మీ గణపతి హెూమం పూజ చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు

చోడవరం : అధిక ఆశ్వీయుజ బహుళ చవితి సందర్భంగా పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీ గణపతి హెూమ పూజ కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి రావు ఆధ్వర్యంలో హెూమ పూజ నిర్వహించి, అనంతరం కార్యసిద్ధి విఘ్నేశ్వర స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ యోగా పోటీలలో

## చోడవరం పతంజలి విద్యార్థుల ప్రతిభ

**మూడు విభాగాల్లో ముగ్గురు విద్యార్థులు ఫైనల్ పోటీలకు ఎంపిక**



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ సోదరుడు జయదేవ్ తదితరులు

చోడవరం : వెస్ట్ బెంగాల్ లోని బాగా ఎంప్లాయ్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగ ఆన్లైన్ పోటీలో చోడవరం పతంజలి యోగా కేంద్రం విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా యోగా గురు పుల్లేటి సతీష్ ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. 8 ఏళ్ల లోపు బాలికల విభాగంలో కొణతాల అవంతిక, 8 నుంచి 12 ఏళ్ల బాలుర విభాగంలో గొంతిన లయ వర్ధన్, 8 - 12 ఏళ్ల బాలికల విభాగంలో పందిరి వెన్నెల శ్రీ ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ సోదరులు జయదేవ్, రమణ మూర్తి, తదితరులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువా వేసి మెమెంటోలు అంద జేసి అభినందించారు.

ఫైనల్ లోనూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి చోడవరం ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యులు బంగారు కృష్ణ, పసుమర్తి అశోక్, గుప్తా, బి గణేష్, పసుమర్తి నానాజీ, ఓరుగంటి రాంబాబు, పూసర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పారంభమైన నృసింహస్వామి ఘాట్ రోడ్డు పనులు



భీమునిపట్నం : స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం కొండ ఘాట్ రోడ్డు పనులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి.శ్రీనివాస రావు లక్ష్మీ నృసింహ స్వామి కొండకు ఘాటు రోడ్డుకు సెప్టెంబర్ 26న శంఖుస్థాపన చేశారు. అతి పురాతన దేవాలయం అయిన లక్ష్మీ నృసింహస్వామి కొండకు ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.75 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి.

కాలినడకన వెళ్ళలేక బాధపడుతున్న భక్తులకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగ పడుతుంది. రోడ్డు ప్రారంభం కావ డంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వేదిక సీసీటీవీ జాతీయ విశిష్ట సేవా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం



విశాఖపట్నం: ఆదరణాలయం ఛారిటీస్, వేదిక సీసీ టీవీ జాతీయ విశిష్ట సేవా పురస్కారముల ప్రదానము కొరకు నిర్వాహకులు దర ఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సంగీత, సాహిత్య, నటన, గానం, నృత్యం, సామాజిక సేవా రంగాలలో, శాస్త్రా -సాంకేతిక, జ్యోతిష్య - వాస్తు, విద్యా బోధన రంగాలలో కృషి చేస్తున్న వారి నుండి విశిష్ట ప్రతిభావంతులు 'బాలరత్న, కళామిత్ర' 'సేవా హృదయ', 'అక్షర రత్న' గురురత్న పురస్కారాల ప్రదానం కొరకు దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు వేదిక సీసీటీవీ కార్యదర్శి కృష్ణకుమారి ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. తెలుగు వారి కీర్తి ప్రతిష్టలను. కళాకారులను, విద్యావేత్తలను, ప్రతిభావంతులైన తెలుగువారిని విశ్వవ్యాప్తంగా పరిచయం చేయడమే కాక తెలుగు ప్రతిభావంతులను, కళాకారులను ఉత్తమ విద్యాబోధనను అందిస్తూ తమ బోధనల ద్వారా సమాజానికి మంచి ప్రతిభావంతులైన విద్యార్థులను అందించే గురువులను, తమ సాహిత్యంతో జనాలను జాగృతం చేసే సాహితివేత్తలను, ప్రజలకు ఆలోచనను, ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందించే కళాకారులను, జ్యోతిష్య, వాస్తు, అధ్యాత్మిక క్రీడా, రంగాలలో సేవలను అందిస్తూన్న పండితులను గుర్తించి గౌరవించడమే తమ వేదిక సీసీటీవీ లక్ష్యమని ఇప్పటికే తమ సంస్త వందల సంఖ్యలో ప్రతిభావంతులను ఈ విశాల ప్రపంచానికి పరిచయం చేసి వారికి ఓ వేదికను కల్పించిందని కాబట్టి విభిన్న రంగాలలో విశిష్ట సేవలందిస్తూ ప్రతిభను కనబరుస్తున్న ప్రతిభావంతులందరు దరఖాస్తు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమం ఆదరణాలయం ఛారిటీస్ వారి సౌజన్యంతో నవంబర్1 వ తేదీన విజయవాడలో తెలుగు చలనచిత్ర, టెలివిజన్, సాహిత్య, రాజకీయ, అధికార, కళా రంగాల ప్రముఖుల సమక్షంలో నిర్వహిస్తున్నామని.. కాబట్టి జాతీయ విశిష్ట సేవా పురస్కారాల కొరకు తమ దరఖాస్తులను వాట్సప్ నంబరు 9848015414 కు లేక ఇ-మెయిల్ ద్వారా అయితే vedikacctvsociety@gmail.comకు అక్టోబర్ 12వ తేదీ లోపు పంపించాలన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గాజువాక : జీవీఎంసీ 65వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గ పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న రోడ్లు, కాలువలు, కల్వర్టులను పునర్నిర్మిస్తున్నట్టు తెలిపారు. జీవీఎంసీ 65 వ వార్డు కాకతీయ ఆర్చి నుంచి కొండపైకి 18.55 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని, గత ప్రభుత్వంలో అంతా హామీలకే ప్రాధాన్యత తప్ప పనులకు లేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేశామని నిజమైన పారదర్శక పాలనకు ఈ పనులే నిదర్శనమని చెప్పారు. కొండవాలు ప్రాంతాలతో ముడిపడి ఉన్న ఈ వార్డుని అభివృద్ధి లో ముందుకు తీసుకు వెళతామని హామీ ఇచ్చారు. వార్డు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి కేబుల్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీధర్, వైయస్ఆర్ సీపీ వార్డు నాయకులు మద్దాల అప్పారావు,నాగిశెట్టి శ్రీనివాస్,ఇరోతి గణేష్,జుత్తు లక్ష్మీ, మంగు నాయుడు, లోకనాథం, రమణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ లో భారీ చేరికలు



దేవరాపల్లి : మండలంలోని కలిగోట్ల గ్రామ పంచాయతీ శివారు దిబ్బగరువు కు చెందిన పలు కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. మాడుగుల శాసన సభ్యులు ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు పార్టీ కండువా మెడలో వేసి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు నచ్చి, ఎమ్మెల్యే బూడి నాయకత్వంలో ముందుకు సాగాలని ఉద్దేశంతో పార్టీ తీర్థం పుచ్చుకున్న మని వారన్నారు.

ఈ కార్యక్రమంలో మండల వై ఎస్ ఆర్ సి పి నాయకులు కర్రి సత్యం, కలిగోట్ల వైకాపా నాయకులు గునూరు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను
## సంపాదకీయం

### కరోనా సంక్షోభ సమయాన్ని సానుకూలంగా మార్చుకోవాలి

కరోనా సంక్షోభ సమయాన్ని సానుకూలంగా మార్చుకోవాలని చెప్పిన ప్రధాని మోదీ. ఈ కష్టకాలాన్ని ప్రజావ్యతిరేక చట్టాల రూపకల్పనకు అవకాశంగా చేసుకున్నట్లు కనబడుతున్నది. వ్యవసాయరంగ సంస్కరణల పేరిట రైతాంగ వ్యతిరేక బిల్లులు మూడు తెచ్చిన మోదీ ప్రభుత్వం, 'విద్యుత్ సవరణ బిల్లు- 2003' పేరిట మరో వినాశకర చట్టాన్ని తేవటానికి సమాయత్తమవుతున్నది. ఈ బిల్లే చట్టరూపం ధరిస్తే విద్యుత్తు ఉత్పాదన, సరఫరా, రాయితీలవం టివన్నీ కేంద్రం చేతుల్లోకి వెళతాయి. మరో అర్థంలో చెప్పాలంటే విద్యుత్తు వ్యవస్థ అంతా ప్రైవేటుపరం అవుతుంది. విధాన నిర్ణయాధి కారమేదీ రాష్ట్రాల చేతుల్లో ఉండదు. వినియోగదారుడైన ప్రతి రైతూ కరెంట్ మోటర్‌కు మీటర్‌ను బిగించుకొని రీడింగ్ ప్రకారం బిల్లులు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న క్రాస్ సబ్సిడీలు, ఉచిత కరెంట్ లాంటివన్నీ చట్టవ్యతిరేకమైపోతాయి. ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసింది. సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడిచే బిల్లును వ్యతిరేకించాల్సిందిగా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలకు పిలుపునిచ్చింది.

మోదీ ప్రభుత్వం మొదటినుంచీ రైతులపై కత్తిగట్టినట్లే వ్యవహరిస్తున్నది. వ్యవసాయాధారిత సమాజంలో రైతుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసి, సబ్సిడీ పథకాలు తేవడానికి బదులు కోతలు వాతలు పెడుతున్నది. దీనిలో భాగంగానే మూడు రైతు వ్యతిరేక బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. పంటలకు గిట్టుబాటు ధరలుబీ ప్రైవేటు పెట్టుబడులు సమకూర్చుకోవటం, తగిన సాంకేతికతను ప్రోదిచేసుకోవటంబీ పంట విక్రయానికి స్వేచ్ఛామార్కెట్ విధానం ఎంతో మేలు చేస్తుందని మోదీ ప్రభుత్వం ఈ బిల్లుల సందర్భంగా చెప్పుకొచ్చింది. కేంద్రం మాటలన్నీ అబద్ధాలకు అందమైన వేషమేసినట్లుగా ఉన్నాయి తప్ప మరొకటి కాదు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, రైతులకు దన్నుగా ఉన్న రైతు వ్యవసాయ మార్కెట్ విధానానికి తూట్లు పొడిచి స్వేచ్ఛామార్కెట్ పేర రైతు ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెడుతున్నది.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయటమే పనిగా పెట్టుకున్నది. దశాబ్దాలుగా ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని లాభాల బాటలో నడుస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఎల్ఐసీ, రైల్వేలు, వైమానిక రంగాల్లోకి ప్రైవేట్‌ను ఆహ్వానిస్తున్నది. చివరికి ఆత్మనిర్భర్ పేరుతో రక్షణ రంగ ఉత్పత్తులను సైతం ప్రైవేటుకు అప్పజెప్పుతున్నది. మొత్తంగా కేంద్ర ప్రభుత్వ విధానాలన్నీ కాకులను కొట్టి గద్దలకు వేసినట్లుగా ప్రజల ప్రయోజనాలను బలిపెడుతున్నవే. ఈ నేపథ్యంలో రైతాంగ సంక్షేమం కోసం కేంద్రంపై రాష్ట్రాలు ఉమ్మడి పోరుకు సమాయత్తం కావలసిన తరుణం ఆసన్నమైనది. ఇందుకు తెలంగాణతో విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలన్నీ చేయి చేయి కలుపాలి. సమాఖ్యస్ఫూర్తికి సమాధి కడుతున్న మోదీ సర్కార్‌ను నిలదీయాలి.

## కరకవలస, బందవలస గ్రామాలలో వైద్యనిపుణులు బృందం పర్యటన



అనంతగిరి : అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ కరకవలస గ్రామం మరియు బందవలస గ్రామాలలో వింత వ్యాధులతో చనిపోయిన విషయం పాఠకులకు విదితమే దీనిపై అధ్యయనం చేయటానికి వైద్య నిపుణులు డాక్టర్ లు, వైద్య పరీక్షలు నిమిత్తం ఈదినము పర్యవేక్షించారు ఈకార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నగేష్,ఈఓ ఆర్డీ, మల్లేశ్వరరావు, కార్యదర్శి పాల్గొన్నారు.

## అఫ్గనిస్తాన్ క్రికెటర్ దుర్మరణం



కాబూల్ : అఫ్గనిస్తాన్ యువ క్రికెటర్, టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ నజీబ్ తరకాయ్(29) దుర్మరణం చెందాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడు ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక మీడియా కథనం ప్రకారం.. వారం రోజుల కిందట తూర్పు నంగన్‌హర్‌లో రోడ్డు దాటుతున్న క్రమంలో ఓ కారు నజీబ్‌ను ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలు కాగా ఆస్పత్రిలో చేర్పించారు. అయితే వైద్యులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కాగా నజీబ్ మరణవార్తను అఫ్గనిస్తాన్ క్రికెట్ బోర్డు మంగళవారం ధ్రువీకరించింది. యువ క్రికెటర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బోర్డు.. దేశమంతా విషాదంలో మునిగిపోయిందని ట్వీట్ చేసింది. నజీబ్ మరణం తమకు తీరని లోటు అని, దూకుడుగా ఇన్నింగ్ ఆరంభించే ఓపెనర్, మంచి మనిషిని కోల్పోయామని విచారం వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదంలో అతడు దుర్మరణం పాలయ్యాడని, నజీబ్ లేడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామంటూ సంతాపం తెలిపింది.

**ఆరు సెంచరీలు చేశాడు**

అఫ్గనిస్తాన్ క్రికెట్ జట్టు తరపున 12 వన్డేలు ఆడిన నజీబ్.. 2017లో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో 90 పరుగులతో రాణించి ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 47.20 సగటు కలిగి ఉన్న ఈ బ్యాట్స్‌మెన్.. కెరీర్ మొత్తంలో ఆరు సెంచరీలు చేశాడు. గతేడాది జరిగిన ష్పగీజా క్రికెట్ లీగ్‌లో స్పీన్ ఘర్ టైగర్స్ తరపున మైదానంలో దిగిన నజీబ్.. టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అదే విధంగా సెప్టెంబరులో మిస్ ఐనాక్ నైట్స్ స్క్వాడ్‌లో అతడు భాగస్వామిగా ఉన్నాడు.

## తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు



కొయ్యూరు : కొయ్యూరు బిజెపి మండల అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు, జెడ్పీటీసీ అభ్యర్థి కూడా నూకరాజు ఆధ్వర్యంలో కొయ్యూరు మండల బిజెపి సభ్యులందరూ మంగళవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొయ్యూరు తహశీల్దార్ తిరుమల రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మీ పార్టీ కార్యకర్తలకు తహశీల్దార్ కార్యాలయంలో ఏమైనా పనులుంటే ప్రభుత్వ నిబంధనల లోబడి సత్వరమే పరిష్కరిస్తానని హామా ఇచ్చారు. అంతేకాకుండా నన్ను మీ మిత్రుడిగా భావించి నాకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో...

మండల మహిళా అధ్యక్షురాలు మచ్చల మంగతల్లి, మండల ఉపాధ్యక్షులు రీమల చంద్రరావు, ఒబిసి ప్రధాన కార్యదర్శి సుంకరి వీరబాబు, మండల ఉపాధ్యక్షులు రాంబాబు, నాని, అరిమెల చిన్న పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో తాండవ రిజర్వాయర్ నీటిమట్టం



నాతవరం : తాండవ రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంది. తాండవ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 379.5 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు డిఈ రాజేంద్రకుమార్, జేఈ శ్యామ్‌కుమార్ నీటిమట్టాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా డిఈ మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తుండటంతో గెడ్డలు పొంగి ఎగువ ప్రాంతం నంచి ప్రాజెక్టులోకి నీరు అధికంగా వచ్చి చేరుతోందని చెప్పారు. ఆగస్టు 5వ తేదీ నుంచి ఆయకట్టు భూములకు పంట కాలువ ద్వారా రోజూ 650 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

ఎగువ ప్రాంతాల నుంచి అధికంగా నీరు రావడంతో ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడం లేదు.

నీరు తగ్గే వరకు స్పిల్‌వే గేట్లు ద్వారా విడుదల చేస్తామన్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టకు సైతం పుష్కలంగా అందిస్తున్నామన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఏడాది కూడా ఖరీఫ్ సీజన్‌కు తాండవ ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంటుందన్నారు.

## భోగాపురంలో కరోనా పరీక్షలు



అచ్యుతాపురం : మండలంలో భోగాపురం గ్రామంలో అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం 200 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు ఆదేశాలు మేరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ ఈ కార్యక్రమాన్ని వైసిపి గ్రామ అధ్యక్షులు లాలం పైడికొండ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గజపతినగరం స్మశాన వాటికలో పిచ్చి తుప్పలు తొలగింపు



చోడవరం : మండలంలోని గజపతినగరం గ్రామంలోని స్మశాన వాటికలో, ప్రాంతాలలో పేరుకుపోయిన పిచ్చి తప్పులను మంగళవారం జెసిబి సహాయంతో తొలగించారు. ఇటీవల కాలంలో యువత పడిన వారిని దహన సంస్కారాలకు తీసుకువెళ్తున్న సమయంలో ఇబ్బందులు పడుతుండటంతో, సచివాలయ కార్యదర్శి యశ్వంత్, మాజీ సర్పంచ్ మల్ల శ్రీనివాస రావు కల్పించుకొని స్మశానంలో పేరుకుపోయిన పిచ్చి తప్పులను తొలగించే పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు కాపారపు నానాజీ, ఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలలో నూతన కార్యదర్శులు నియామకం



దేవరాపల్లి : మండలంలోని నూతనంగా ఎనిమిది మంది గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగిందని ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, మండల పరిషత్ పరిపాలన అధికారి జి.వి. రమణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మామిడిపల్లి, చింతల పూడి, ఎన్.జి. నగరం, చెనులపాలెం, వాలబు, బోయిలకింతాడ, చిననందిపల్లి, తారువా, గ్రామ సచివాలయంలో గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి నియామకం జరిగిందన్నారు. గ్రామ సచివాలయంలతో ప్రభుత్వం మరింత ప్రజలకు సేవలు అందించేందుకు ఈ గ్రామ సచివాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామసభ



గొలుగొండ : గొలుగొండ మండలం కసిమి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి రమణమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వాలంటీర్స్, ఆశ కార్యకర్త, అంగన్వాడీ టీచర్, వైయస్సార్ సిపి నాయకులు, గిరిజన నాయకులు కసిమి రమణ, సచివాలయం సిబ్బంది ఫణింద్ర, హార్టికల్చర్ మైదీన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛ కార్మికులను సన్మానించారు.

## ర్యాలి క్షేత్రానికి అందుకే ఆ పేరు వచ్చిందట!



శ్రీమహావిష్ణువు లోక కల్యాణం కోసం ధరించిన రూపాలలో జగన్మోహిని రూపం ఒకటి. దేవతల నుంచి అమృతాన్ని దక్కించుకోవడానికి అసురులు ప్రయత్నిస్తూ వుండగా, వాళ్లకి అమృత భాండం చిక్కకుండా చేయడం కోసం స్వామి జగన్మోహిని రూపాన్ని ధరించాడు. అలా స్వామి తాను అనుకున్న కార్యాన్ని పూర్తిచేసిన తరువాత, పరమశివుడి కంటపడతాడు. జగన్మోహిని సౌందర్య విశేషం సదాశివుడిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. విష్ణు మాయ కారణంగా ఆకర్షితుడైన శివుడు .. జగన్మోహినిని అనుసరి స్తాడు. ఆయన వెంబడిస్తుండటం గమనించిన జగన్మోహిని తన నడక వేగాన్ని పెంచుతుంది. అలా హడావిడిగా ఆమె వెళుతూ వుండగా ఆమె తలలో తురుముకున్న పుష్పం ఒకటి 'రాలి' పడిపోతుంది. లోక కల్యాణం కోసం వచ్చిన జగన్మోహిని తలలోని పుష్పం 'రాలి' పడిన ప్రదేశం కనుక, ఈ ప్రదేశానికి 'ర్యాలి' అనే పేరు వచ్చిందననేది ఒక కథగా చెబుతారు. ఒకే మూలమూర్తికి ముందు భాగంలో కేశవస్వామి దర్శనమిస్తూ ఉండగా, వెనుక భాగంలో జగన్మోహిని రూపం కనిపిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలం పరిధిలో ఈ క్షేత్రం అలరారుతోంది. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన, విశేషమైన ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

## చెన్నకేశవస్వామి మహిమ!



శ్రీమహావిష్ణువు .. శ్రీచెన్నకేశవస్వామిగా ఆవిర్భవించిన క్షేత్రాలలో ఒకటిగా 'ఉల్లిపాలెం' కనిపిస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహిమాన్వితమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా వెలుగొందుతోంది. 'నగరం' మండలంలోని ఈ క్షేత్రంలో శ్రీ భూ నీలాదేవి సమేత చెన్నకేశవస్వామి పూజాభిషేకాలు అందుకుంటూ వస్తున్నాడు. ఇక్కడ స్వామి కొలువుదీరడం వెనుకనే ఆయన మహిమ ఎంతటిదో తెలుస్తుంది. పూర్వం ఇక్కడి గ్రామంలోని జమీందారుకి కలలో స్వామివారు కనిపించి తన జాడ తెలియజేసి, తనని ఈ గ్రామంలో ప్రతిష్ఠించి పూజించమని చెప్పాడట. అయితే ఇది సాధారణమైన కలే అనుకుని ఆయన తన దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాడు. దాంతో మరుసటి రోజు రాత్రి ఆయనకి స్వామి మళ్లీ స్వప్నంలో కనిపించడమే కాకుండా, తాను చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తుచేశాడట. అంతేకాకుండా వెంటనే తన మూర్తిని ఆ గ్రామానికి తరలించమంటూ తట్టి లేపాడట. అప్పుడు ఆయన ఆ పనికి పూనుకుని 'అల్లపర్రు'లోని స్వామివారి ప్రతిమను 'ఉల్లిపాలెం' చేర్చారట. అలా స్వామి తమ గ్రామానికి కోరి వచ్చాడు కనుక, ఇక్కడి ప్రజలంతా స్వామిని తమ ఇష్టదైవంగా భావిస్తుంటారు. అనునిత్యం ఆ స్వామిని కొలుస్తూ తరిస్తుంటారు.

# కరోనా ప్రభావంతో బాలల హక్కులకు విఘాతం

## - రాష్ట్ర సీఆర్పీఎఫ్ జూమ్ సదస్సులో ప్రధాన వక్తలు



విశాఖపట్నం : కరోనా ప్రభావంతో రాష్ట్రంలోని అందరు బాలలు హక్కులను కోల్పోతున్నారని శాసన మండలి సభ్యులు వి.బాలసుబ్రహ్మణ్యం, ఎం.వి.ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డిలు అన్నారు. జాతీయ విద్యావిధానం 2020, రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీరు, తెన్నులపై ఆంధ్ర ప్రదేశ్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం ఆధ్వర్యంలో 13 జిల్లాల ఫోరం ప్రతినిధులు,సహచర ఎన్ జి ఒ మిత్రులు,అధికారులు తో వెబినార్ జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంధాన కర్తగా ఆర్.వెంకటరెడ్డి వ్యవహరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసన మండలి సభ్యుడు వి .బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కరోనా ప్రభావంతో అన్ని వర్గాలు, రంగాల కన్నా బాలల విద్యా వ్యవస్థ,హక్కుల వ్యవస్థ, అర్థాకలితో ఎంతో మంది బాలలు ఆర్తనాదాలు మిన్నంటాయ న్నారు,చిన్న పిల్లల సమస్యలను చిన్నగా చూడకూడదని,పెద్దలు తో సమానంగా పర్యవేక్షించిన నాడే బాలలకు న్యాయం జరుగుతుందని అన్నారు. జాతీయ విద్యా విధానంపై పెద్ద స్థాయిలో చర్చలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలతో ప్రభుత్వాలు ప్రజల్లోకి వెళ్లాలని అపుడే ఈ విధానంపై లోటు పాట్లు అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఎంవి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కరోనా వల్ల విద్య పిల్లల చేతుల్లో నిలవగలగాలంటే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం, ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న, గ్రామ, వార్డ్, సచివాలయ వ్యవస్థ, వాలెంటరీ సిబ్బందితో నేరుగా నోట్సు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యా సంభందిత మెటీరియల్స్ ని విద్యార్థులకు నూటికి నూరుపాళ్లు అందించి వారిని జాగృత పరచాలని అన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం 2020 మీద ఉభయ చట్ట సభల్లో చర్చలు ఎంత లోతుగా జరిగితే అంత చక్కని ఫలితాలు విద్యార్థులకు అందే అవకాశముందని గుర్తు చేశారు.ఈ విధానం అమలు చేసే ముందు ప్రణాళికలు కూడా అంతే అత్యవసరం అని అన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం మాట్లాడుతూ ఈ వెబినార్ సదస్సు ద్వారా 13 జిల్లాల ఫోరం సభ్యులు వెలిబుచ్చిన, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, దివ్యాంగ బాలల సమస్యలు తో పాటు, ఇతర సమస్యలను ఆయా జిల్లాల ఫోరంల నాయకుల ఆధ్వర్యంలో ఉన్నతాధికారులతో పాటు,రాష్ట్ర ముఖ్య మంత్రి,విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ,ఆరోగ్య,స్త్రీ,శిశు సంక్షేమ శాఖల తో పాటు మిగతా శాఖల మంత్రులు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఫోరం, జాతీయ కార్యదర్శి, డి.ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల మాట్లాడుతూ తమ ఫోరం సభ్యులతో పాటు ఈ వెబైనార్ సదస్సులో పాల్గొన్న ఇతర బాలల హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తున్న ఇతర ఎన్ ఓ ప్రతినిధులు చర్చించిన ప్రతీ అంశాన్ని ప్రభుత్వం ముందు ఉంచుతామని అన్నారు.

ఈ సదస్సులో రాష్ట్రంలోని 13 జిల్లాల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,ఇతర ప్రధాన ప్రతినిధులు పాల్గొన్నారు.

# గజపతినగరంలో చర్చి ప్రారంభాన్ని అభ్యంతరం తెలిపిన గ్రామస్తులు

## అనుమతులు లేకుండా నిర్మాణం జరపడం పట్ల సచివాలయంలో ఫిర్యాదు



గజపతినగరంలో చర్చి నిర్మాణం పై సచివాలయం సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

చోడవరం : మండలంలోని గజపతి నగరం గ్రామంలో అనధికారికంగా చర్చి నిర్మించడంతో పాటు, ప్రారంభించేందుకు సిద్ధ పడుతుండటంతో గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా చర్చి పరిసర ప్రాంతాల్లో ఉన్న వారితో పాటు, గ్రామస్తులు సచివాలయంలోని అధికారులకు ఫిర్యాదు చేశారు. చుట్టూ హిందువులు నివాసం తో పాటు చర్చి కట్టిన ప్రాంతానికి సమీపంలోనే హిందూ దేవాలయాలు రామాలయం, శ్రీ క్రిష్ణ మందిరం, దుర్గా దేవి గుడి, పూల తల్లి ఆలయం, ఉందని, అలాగే గ్రామంలో ఏ అమ్మవారి పండగ చేసిన ప్రతిసారి పుట్టుక ఇక్కడి నుండే తీసుకు రావడం జరుగుతుందని వివరించారు. పూర్వీకుల నుంచి ఈ సాంప్రదాయం కొనసాగుతుందని, అయితే ఇటీవల కాలంలో గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నాం అంటూ షెడ్డు వేసి దానిని చర్చి కింద మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

అధికారులు హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని, అలాగే చర్చి ప్రారంభించకుండా నిలిపేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ అధికారులను కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని సచివాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్వో సత్యనారాయణ, సచి వాలయం సెక్రటరీ యశ్వంత్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ మహేష్, మహిళా కానిస్టేబుల్ గనమ్మ స్థానికులు తాత అప్పారావు, కోటి, అచ్యుతరావు, రామారావు, నరేష్ , కర్రి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

# పల్లా రాకతో టీడీపీ కి నూతనోత్సాహం

## - పట్టణ టీడీపీ అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు

భీమునిపట్నం: నాయకత్వం లోపంతో నిరాసపడుతున్న టీడీపీ కేడర్ కు పల్లా రాకతో నూతనోత్సాహం వచ్చిందని తగరపువలస డివిజన్ టిడిపి అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు అన్నారు.

ఉత్సాహవంతుడు, యువకుడు, రాజకీయ చతురత ఉన్న మాజీ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ను విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గా నియమించడం పట్ల పట్టణ అధ్యక్షులు తమ్మిన సూరిబాబు తో పాటు బిసి సెల్ అధ్యక్షులు దొంతల పైడిరాజు, ఎస్సి సెల్ అధ్యక్షులు రవ్వ వెంకటరావు, 1 వ వార్డు ప్రచార కమిటీ అధ్యక్షులు పిల్లా రాజేష్ లు హర్షం వ్యక్తంచేశారు. పల్లా రాకతో పార్టీ లో యువతకు ప్రాధాన్యం పెరుగు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# గతంలో మంజూరు అయిన ఇళ్ళను రద్దు చేస్తూ మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పత్రికా విలేఖరుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు ఎం. రవీంద్ర మాట్లాడుతూ స్వంత ఇళ్ళు అనేది ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాల కల అని, ఆ కలని సాకారం చేసేందుకు మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ఒక గొప్ప ఆశయంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రధానమంత్రి ఆవాస్ యోజన అనే పథకాన్ని ప్రవేశపెట్టి 2022 వ సంవత్సరానికల్లా దేశంలో ప్రతి ఒక్కరికి స్వంత ఇళ్ళు ఉండాలని పథకాన్ని ప్రవేశపెట్టారు కానీ, రాష్ట్ర ప్రభుత్వం తమ స్వప్రయోజనాల కోసం ఇదివరకే మంజూరు అయిన ఇళ్ల కోసం డిడిలు చెల్లించిన కూడా, గత ప్రభుత్వాలు కేటాయించిన ఇళ్ళు అన్నింటిని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మంగళవారం జివియంసి కమిషనర్ సృజన ఇదివరకు డిడిలు కట్టిన ఇళ్ళు అన్నిటిని రద్దు చేసి మళ్ళీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం జరిగిందని, ఇది చాలా తప్పుడు నిర్ణయం అని అన్నారు. ఇదివరకే ఈ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుదారుల వివరాలన్నీ పరిశీలించి లబ్దిదారులనుంచి డిడిలు కట్టించుకొని ఇప్పుడు రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్య క్షులు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కల ఏమనగా మనకు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయ్యేసరికి ప్రతి ఒక్కరికి స్వంత ఇళ్ళు ఉండాలనే ఉద్దేశ్యంతో 2015 జూన్ లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన %ూపీహ్% అనే పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరు అద్దె ఇంటిలో కాకుండా స్వంత ఇల్లు ఉండాలనే భావనతో ఈ పథకాన్ని మొదలుపెట్టారు. ఈ పథకం ద్వారా నిర్మించే ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయలు సబ్సిడీ మరియు రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయలు సబ్సిడీ ఇస్తూ ప్రభుత్వ స్థలాలలోనే ఇళ్ళు నిర్మించదలచాలని గత ప్రభుత్వం మంచి ప్రయత్నం చేసిందని అన్నారు. ఈ ప్రయత్నంలో భాగంగా మన రాష్ట్రానికి 2,13,000 ఇళ్ళు కావాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కోరగా కేంద్ర ప్రభుత్వం 1,96,000 ఇళ్లను కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు గారు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని, 1,96,000 ఇళ్లను మంజూరు చేయడం దేశంలో ఏ రాష్ట్రానికి కూడా అంతపెద్ద మొత్తంలో ఇళ్లను మన రాష్ట్రానికి కేటాయించారని, ఇంకా మన రాష్ట్రానికి ఇళ్ళు కావాలని కేంద్రాన్ని అడగగా మళ్ళీ కేంద్ర ప్రభుత్వం 5,00,000 ఇళ్లను కేటాయించిందని మొత్తంగా సుమారు 7,00,000 ఇళ్లను మన రాష్ట్రానికి కేంద్రం కేటాయించిందని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 4,74,000 ఇళ్ళు నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిన కూడా రకరకాల ఇబ్బందుల వలన 170 ప్రాంతాలలో 94 మునిసిపాలిటీలలో 3,13,832 ఇళ్ళు మాత్రమే 170 ప్రాంతాలలో నిర్మాణం మొదలయిందని అన్నారు. వాటిలో సుమారు 80,000 ఇళ్ళు నిర్మాణం ఇదివరకే పూర్తి అయిందని అన్నారు. మిగిలిన ఇళ్ళు నిర్మాణ దశలోనే ఉన్నాయన్నారు. కానీ ప్రస్తుతం మన రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క అంగుళం కూడా ఇళ్ల నిర్మాణం ముందుకు వెళ్లలేదని అన్నారు. ఈ పథకంలో విశాఖపట్నానికి APTIDCO సంస్థ మొత్తం 57,499 టెండర్లను పిలవగా రాష్ట్ర ప్రభుత్వం 28,156 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందని అన్నారు. ఈ పథకంలో అర్హులైన లబ్ధిదారుల నుండి డిడిలు కట్టించుకొని రెండున్నర సంవత్సరాల తరువాత రద్దు చేసి ఇప్పుడు మళ్ళీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం దారుణాతిదారుణమని అన్నారు. ఈ పథకంలో డిడిలు కట్టిన లబ్ధిదారు లందరు కూడా అప్పులు చేసి డిడిలు కట్టారని, రెండున్నర సంవత్సరాల తరువాత ఇప్పుడు ఆ డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, డబ్బులు కట్టిన వారందరికీ తక్షణమే ఇళ్లను కేటాయించాలని కోరారు. ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి పునరాలోచించు కోవాలని లేదంటే తీవ్రమైన ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఎన్టీపీసీ అధికారులను కలిసిన బీజేపీ నాయకులు



పరవాడ : బారతీయ జనతాపార్టీ ఆదినాయ కుల ఆదేశాలు మేరకు పెందుర్తి నియోజక వర్గంలో గల పరవాడ భాజాపా నాయకు లంతా కలిసి యన్.టీ.పీ.సి హెచ్.ఆర్.కే.హానువహాన్ ప్రసాద్‌ని కలవడం జరిగింది. ఈయొక్క సందర్భంగా సియ స్సార్.నిదులుతొ కాలువలు రోడ్లు విద్య వైద్య సేవలు అందజేయాలని అలాగే మన ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో బాగంగా స్తానిక గ్రామ నిరుద్యోగులకు 75% శాతం ఉపాధి కల్పిం చాలని కాలుష్యం రాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని కోరడం జరిగింది. ఈవిషంపై పై అధికారులతో చర్చించి తగు న్యాయం చేస్తామని సానుకూలంగా స్పందించారు.

ఈ కార్యక్రమంలో పెందుర్తి కోకన్వీనర్, మాజీ జడ్పిటిసి బొద్దపు వెంకట రమణ, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల అప్పారావు, పట్టాభి ప్రసాద్, యస్.యస్. నాయుడు, నూక రాజు తదితరులు పాల్గొన్నారు.

# గజపతినగరం లో 68 మందికి కోవిడ్-19 పరీక్షలు



గజపతినగరంలో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చోడవరం : మండలంలోని గజపతి నగరం గ్రామంలో 68 మందికి కోవిడ్ - 19 పరీక్షలు నిర్వహించినట్లు గవరవరం పి హెచ్ సి వైద్య అధికారిని డాక్టర్ దమయంతి దేవి మంగళవారం తెలిపారు. ప్రభుత్వ, వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాను సారం మండలంలోని ఒక్కొక్క గ్రామంలో ఒక్క రోజున కువైట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు నాగేశ్వరరావు, రామకృష్ణ, మూర్తి, ఏఎన్ఎంలు శ్రీదేవి, నూకరత్నం, లక్ష్మి, ఆశా వర్కర్లు లీల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై అవగాహన



దేవరాపల్లి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలపై మండల సమైక్య షెడ్యూల్ సమావేశంలో డ్వాక్రా మహిళలకు అవగాహన కలుగజేశారు. మంగళ వారం జరిగిన ఈ సమావేశం మండల సమైక్య అధ్యక్షులు ఎ. నరసమ్మ అధ్యక్షతన ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి మాట్లాడుతూ, శ్రీనిధి రికవరీ, బ్యాంకు లింకేజీ, పలు సమస్యలపై సమావేశం జరిగింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం సునీత, మేనేజర్ సత్తిబాబు, ఇందిర క్రాంతి పథకం ఏపిఎం బి.డి. తిలక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు స్ఫూర్తి సవర రవితేజ



శ్రీకాకుళం : సవర రవితేజ స్ఫూర్తితో గిరిజన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి సి.హెచ్.శ్రీధర్ పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక వై.టి.సి.లో ఐ.ఐ.టి. సూపర్ -60 విజయకేతనం పై పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పి.ఓ. మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ఐ.ఐ.టి, నిట్ వంటి కళాశాలలలో ప్రవేశం కల్పించటానికి. జిల్లా కలెక్టర్ జె.నివాస్, గత పి.ఓ సాయికాంత్ వర్మ, ఆగస్టు 3న ఐ.ఐ.టి. సూపర్ 60ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వై.టి.సి.లో వారికి మంచి శిక్షణ నివ్వడం జరుగుతున్నదని తెలిపారు. 55 మందికి కోచింగ్ అందించగా 33 మంది ప్రవేశ పరీక్షకు అర్హత సాధించడం జరిగిందని తెలిపారు. జె.ఇ.ఇ. అడ్వాన్స్ డ్ లో ఐ.ఐ.టి. కి అయిదుగురు, జె.ఇ.ఇ. మెయిన్స్ లో నిట్, ఐ.ఐ.టిలలో ప్రవేశానికి 12 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. జె.ఇ.ఇ. ప్రిపరేటరీ ర్యాంకులో మరొక నలుగురు విద్యార్థులున్నారని, తెలిపారు. సవర రవితేజ, ఐ.ఐ.టి-జెఇఇ లో 832 వర్యాంకు సాధించడం ఒక గర్వకారణమన్నారు. రవితేజ పేరును ఒక తరగతి గదికి నామకరణం చేస్తామని, తద్వారా మిగిలిన విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. మొదటి సారిగా 16 మంది విద్యార్థులకు సీటు రావడం సంతోషదాయకమని గిరిజన విద్యార్థులకు ఇది గర్వకారణమని అన్నారు. కరోనా సమయంలో ఆన్ లైన్ క్లాసులు నిర్వహించడం జరిగిందన్నారు. వచ్చే ఏడాది మరిన్ని మంచి ఫలితాలు రావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. టీచింగ్ స్టాఫ్, , కోర్స్ కో-ఆర్డినేటర్ లు మంచి కృషి చేశారన్నారు. ఐ.ఐ.టి, సూపర్ 60 ఎ.ఓ. గున్ను రామ్మోహన్ రావు మాట్లాడుతూ, 5 నెలల కాలంలోనే మంచి ఫలితాలు సాధించడం జరిగిందని, నిబద్ధతతో ఉపాధ్యాయుల బోధన, మంచి పట్టుదల, క్రమ శిక్షణతో విద్యార్థులు చదువుకోవడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కార్పొరేట్ కాలేజీలు సాధించని మంచి ర్యాంకులు గిరిజన విద్యార్థులు సాధించడం చాలా సంతోషదాయకమన్నారు. కరోనా సమయంలో విద్యార్థులకు పి.ఓ., ల్యాప్ టాప్ లు అందించి, ఆన్ లైన్ ద్వారా శిక్షణ నిచ్చారన్నారు. రికార్డు స్థాయిలో ఫలితాలు రావడం గర్వ కారణ మన్నారు.

## హత్రాస్ యువతి అత్యాచార నేరస్తులను కఠినంగా శిక్షించాలని ర్యాలీ




అన్నవరం : ఉత్తరప్రదేశ్ హత్రాస్ జిల్లాలో 19 ఏళ్ళ దళిత యువతిని దారుణంగా సామూహిక అత్యాచారం చేసి,పాశవికంగా హింసించి, నాలుక కోసి హత్య చేసిన నరహంతకులపై నిర్భయ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని,చట్టాలు సక్రమంగా అమలు చేయాలని నినాదిస్తు ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఎ.ఐ.ఎల్.యు భారత రాజ్యాంగం పరిరక్షణ సమితి-దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి మెయిన్ రోడ్డు మీదుగా పోలీసు స్టేషన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.ముందుగా బాధిత యువతికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అద్యక్షులు ఎమ్.గంగా సూరి బాబు, ఎ.ఐ.ఎల్.యు జిల్లా నాయకులు మల్లేశ్వర రావు, సిఐటియు మండలం కార్య దర్శిలు యన్.శ్రీను, యస్.కె. పద్మ, మాట్లాడుతూ దేశంలో రోజురోజుకి అత్యాచారాలు, హత్యలు పెరుగుపోతున్నాయని, చట్టాలు సక్రమంగా పని చేయడం లేదని, చట్టాలు కొంద రకు చుట్టాలుగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పిం చడంలో విఫలమవు తున్నాయని,ఉన్న నిర్భయ చట్టం సక్రమంగా అమలు చేయడం లేదని, చట్టం పలు రాష్ట్రాలలో అగ్రవర్ణాలకు, రాజకీయ పలుకుబడికి లొంగి పోతుందని మండిపడ్డారు. మద్యం, మాదక ద్రవ్యాలను, అశ్లీల వెబ్ సైట్లను నిషేధిం చాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ శంఖవరం మండలం అధ్యక్ష, కార్యదర్శిలు దేవిశ్రీప్రసాద్, శివరాజు, తొండంగి మండలం కార్యదర్శి చిట్టిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీవారి, వీరబాబు, సిఐటియు నాయకులు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా అరుణకుమారి

నాతవరం : జాతీయ స్థాయిలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణలో ప్రతిభ కనబరిచిన గుంటల అరుణ కుమారిని రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా ప్రభుత్వం ఎంపిక చేసిందని ఎంఇఒ టి.అమృతకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మార్పులకు అనుగుణంగా విద్యను అందించడం కోసం ఎన్‌సిఈఆర్‌టి ఆధ్వర్యంలో జూన్ 17 నుంచి జులై 15 వరకు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో నిర్వహించిన పలు పరీక్షల్లో మండలంలోని మర్రిపాలెం పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు అరుణకుమారి ప్రతిభ చూపించాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆమెను సత్కరించి ప్రశంసాపత్రం అందజేసింది. ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మన రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ద్వారా విద్యకు సంబంధించి పలు అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా అరుణకుమారిని ఎంపిక చేశారు. ఆమె ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి వచ్చే ఏడాది జనవరి 3 వరకు 90 రోజుల పాటు పలు మండలాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు.

## సచివాలయం ద్వారా సత్వర సేవలు



కంచరపాలెం : సచివాలయం ద్వారా ప్రజలు సత్వర సేవలు పొందుతున్నారని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ పి.సింహచలం పేర్కొన్నారు.

ఈ మేరకు జీవీఎంసీ 45 వ వార్డు పరిధి ఎకెసి కాలనీ వద్ద మంగళవారం నిర్వహించిన ప్రశంస కార్యక్రమంలో జోన్ -4 కమిషనర్ పి.సింహచలం, వైసీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త మళ్ల విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

వార్డు సచి వాలయం స్థాపన మొదటి సంవత్సరం వేడుకల సందర్భంగా సెక్ర టరీలు, వాలంటీర్లు మరియు శానిటరీ కార్మికులకు ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

## ప్రభుత్వం పేదల గృహనిర్మాణాలపై స్పష్టత ఇవ్వాలి



మధురవాడ : రాష్ట్ర ప్రభుత్వం పేదల గృహనిర్మాణాల స్కీం పైన స్పష్టమైన వైఖరి ఇవ్వాలని మహా విశాఖ 6 వ వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ డిమాండ్ చేసారు, రాజకీయాలకి అతీతంగా ఏ నియోజకవర్గం ప్రజలకు అక్కడి ఉపాధి అవకాశాలు పోకుండా ఆదే ప్రాంతంలో ఏపీ టిట్కో, పిఎంఎవై స్కీం ద్వారా ఎంతోమంది పేద ప్రజలు సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు...

ప్రభుత్వ భూమిలో టాటా హౌసింగ్ సంస్థ ద్వారా ఇళ్ళ నిర్మాణం చేపట్టడం జరిగిందని, అనేక మంది పేద ప్రజలు ఇళ్ల కోసం ఇప్పటికే డిడిలు కట్టారని, కానీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల హామీ కింద ఇల్లు ఉచితంగా కట్టిస్తాం అని హామీ ఇవ్వడంతో లబ్ధిదారుల డిడిలు తిరిగి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని ఐతే కొత్తపద్ధతి ద్వారా లబ్ధిదారులను తిరిగి ఎంపిక చేస్తాం అనేది సబబు కాదని జీవీఎంసీ కమిషనర్ వ్యాఖ్యల వల్ల విశాఖపట్నం లో ఉన్న 40 వేల మంది లబ్ధిదారులకు ఆందోళన కలిగించేలా ఉందని ఇప్పటికైనా అధికారికంగా ఒక స్పష్టమైన వైఖరిని ఇచ్చి లబ్ధిదారులను ఆందోళనకి గురి చేయకుండా ఆదుకోవాలని ఒక పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.

# పోర్టు సిబ్బంది కృషితోనే ఉత్తమ ఫలితాలు




### మొదటి పేజీ తరువాయి

సంవత్సరంలో తొలి అర్ధ భాగంలో 32.77 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయానికి 34.75 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసింది.

గత ఆర్థిక సంవత్సరం తో పోల్చుకుంటే ఈ ఏడాది మొదటి అర్ధ భాగం లో 1.98 మిలియన్ టన్నుల తక్కువ సరుకు రవాణా జరిగింది. గత ఏడాది తొలి అర్ధ భాగంతో పోల్చుకుంటే ఇది 5.7 శాతం తక్కువ. సరుకు రవాణాలో తగ్గుదల పరంగా చూసుకుంటే మిగిలిన అన్ని మేనేజర్ పోస్టుల కంటే కూడా విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ తక్కువ తగ్గుదలను నమోదు చేసింది. 2019 ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్ధభాగంలో విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ మొత్తం 1056 వెసెల్స్ ను హ్యాండిల్ చేసింది. అదే ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 1016 వెసెల్స్ ను చేసింది. ఆర్థిక మందగమనం కారణంగా విద్యుత్ రంగానికి సంబంధించిన ముడి సరుకు రవాణాలో చెప్పుకోదగిన తగ్గుదల నమోదైంది. స్టీమ్ విభాగంలో స్టీమ్ కోల్, పెట్రోలియం సెక్టార్ లో కుకింగ్ కోల్, పెట్రోలియం రంగంలో ముడి చమురు కంటైనర్ సరుకు రవాణాలో తగ్గుదల నమోదైంది.

ఇనుప ఖనిజం, పెల్లెట్స్, TANGEDCO కు సముద్రమార్గం ద్వారా బొగ్గు రవాణా, ఎరువులు, ఇనుము, కంటైనర్ ఎగుమతుల్లో వృద్ధి నమోదు అయ్యింది.

ఆస్ట్రేలియా బ్రెజిల్ దేశాలలో ఇనుప ఖనిజం ఉత్పత్తి తగ్గడంతో చైనా , భారత్ నుంచి ఇనుప ఖనిజాన్ని దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ఇనుప ఖనిజం ఎగుమతుల్లో వృద్ధి నమోదైంది.

చైనా, సౌత్ కొరియా, జపాన్ లో నుంచి స్టీల్ కు డిమాండ్ ఉండటంతో ఎగుమతుల్లో వృద్ధి

విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ యాజమాన్యం చేస్తున్న నిరంతర కృషితో ఎరువుల ఎగుమతుల్లో వృద్ధి నమోదవుతోంది వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల కారణంగా కంటైనర్ రవాణాలో వృద్ధి నమోదు ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేయడంలో రైల్వేల పరంగా టెర్మినల్ చార్జెస్ లో రిబేటు ఇవ్వటం వంటి చర్యల వల్ల ఇనుప ఖనిజం ఎగుమతుల్లో వృద్ధి ప్రధాన మార్గంలోని వెస్సెల్స్ కు ప్రత్యేక రిబేటు ఇవ్వడం వంటి చర్యలు ఈ.క్యూ 7 బెర్త్ ను క్రేన్ రహిత బెర్త్ గా వినియోగం. దీని వల్ల క్రేన్ ల ద్వారా నిర్వహించే బెర్త్ ల కంటేతక్కువ ఖర్చులు. విద్యుత్ క్రేన్ లు లేకుండా సరుకు రవాణా చేసే వాణిజ్య వేత్తలకు దీనివల్ల ప్రయోజనం కలుగుతుంది.

### ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం

పోర్టు కమ్యూనిటీ సిస్టం మాడ్యూల్ ను (PCS 1X) ఇంప్లిమెంట్ చేయడం

అవసరం అనుకున్న వారికి ఆన్ లైన్ ద్వారా డాక్యుమెంట్లను సమర్పించే అవకాశం పోర్టు నుంచి వాహనాలను త్వరగా తరలించేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ విధానాన్ని అమలు చేయడం రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ధరలను సరళీకరణ చేయడం డాక్యుమెంట్లను త్వరగా పూర్తి చేసేందుకు విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ సమన్వయకర్తగా ICEGATE ఐటి పోర్టల్ అందుబాటులోకి

కంటైనర్లు నేరుగా పోర్టులోకి ప్రవేశించి, సరుకు డెలివరీ చేసే విధానం అందుబాటులోకి రాత్రి సమయంలో నావిగేషన్ కు వీలు కల్పించేలా పనామాక్స్ వెలెల్స్ యొక్క డ్రాఫ్ట్ ను 14 మీటర్ల నుంచి 14.5 మీటర్లకు పెంచటం ఇన్నర్ హార్బర్ లో వెసెల్ యొక్క భీమ్ ను 32.5 మీటర్ల నుంచి 38 మీటర్లకు పెంచటం

### కొవిడ్-19 ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకున్న చర్యలు

పోర్టులలో సరుకు రవాణా మరియు సరుకు నిల్వలను అత్యవసర సర్వీసుల పరిధిలోకి తీసుకురావడం లాక్ డౌన్ ను సమయంలో రవాణా నిరంతరం జరిగే విధంగా విశాఖపట్టణం పోర్ట్ ట్రస్ట్ కోవిడ్-19 నిబంధనలను అనుసరించి అనేక చర్యలు చేపట్టింది ప్రాథమిక ఆరోగ్య అధికారి షిప్ లోని సిబ్బందిని పరిశీలించిన తరువాత హార్బర్ మాస్టర్ మరో మారు పరిశీలించి దానిని అంగీకరించిన తర్వాత మాత్రమే హార్బర్ లో కి షిప్ లను అనుమతించటం షిప్పు లోని సిబ్బంది ఎట్టి పరిస్థితులలోనూ షిప్ నుంచి కిందకి దిగడానికి అనుమతి లేదు. అవసరమైన సిబ్బంది మాత్రమే తక్కువ సంఖ్యలో నిర్దేశిత పిపిఈ కిట్లను ధరించి, సరైన శానిటేషన్ ప్రక్రియపూర్తిచేసుకున్న తరువాత మాత్రమే షిప్పులలోనికి అనుమతి

### ప్రామాణిక నిర్వహణ వ్యవస్థ అమలు పరిచారు

పైలట్లకు పూర్తి రక్షణ కల్పించే విధంగా శరీరాన్ని పూర్తి కప్పి ఉంచేలా సూట్, మరియు స్టెరిలైజ్ చేసిన హ్యాండ్ గ్లౌజులు ఎన్ 95 మాస్కల అందజేత షిప్పింగ్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న వారికి త్రిబుల్ లేయర్ మాస్క్ అందజేత పోర్టు లోని అన్ని కార్య నిర్వాహక ప్రదేశాలలో చేతులను పరిశు భ్రం చేసుకునేందుకు సదుపాయాలు, సోప్ క్రిమి సంహారక మందుల ఏర్పాటు విశాఖపట్టణం పోర్ట్ ట్రస్ట్ కు సంబంధించిన అన్ని భవనాలను సోడియం హైపోక్లోరైట్ ద్రావణంతో నిర్దేశిత సమయాలలో పిచికారీ చేయడం విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ఉద్యోగుల కోసం పోర్టు స్టేడియంలోని ఇండోర్ స్టేడియం, కోవిడ్ ఐసోలేషన్ సెంటర్ మరియు కోవిడ్ చికిత్స కేంద్రం గా మార్పు

### కోవిడ్ కేర్ సెంటర్ లో 63 బెడ్ ల ఏర్పాటు

కోవిడ్ నిర్ధారణ కోసం కోవిడ్ కేస్ సెంటర్ లో ర్యాపిడ్ యాంటిజెంట్ టేస్ట్ సదుపాయ స్వల్ప కోవిడ్ లక్షణాలు ఉన్నవారికి కోవిడ్ కేర్ సెంటర్ లో చికిత్స ఆక్సిజన్ స్థాయి లో 95, 94 కంటే తక్కువ ఉన్న పేషెంట్లను అత్యాధునిక వసతులు, వెంటిలేటర్ సదుపాయం ఉన్న ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ కోవిడ్ కేర్ సెంటర్ లోని అన్ని బెడ్ లకు ఆక్సిజన్, వేపరైజర్, పల్స్ ఆక్సీ మీటర్, థెర్మోమీటర్ మొబైల్ ఛార్జింగ్ సదుపాయాల కల్పన కొవిడ్ కేర్ సెంటర్ వద్ద 24 గంటలు అందుబాటులో అంబులెన్స్ సేవలు కోవిడ్ కేర్ సెంటర్ వద్ద అందుబాటులో ఈసీజీ పరికరం

అత్యవసర పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు కొవిడ్ కేర్ సెంటర్ వద్ద అగ్నిమాపక శకటం

### కోవిడ్ కేర్ సెంటర్ వద్ద పాటించే విధానాలు

ఉదయం 6 గంటల నుంచి 6:30 గంటల వరకు ప్రాణాయామం బ్రేక్ ఫాస్ట్ మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం మధ్యాహ్నం స్నాక్స్ రాత్రి 8:30 కి భోజనం పేషెంట్లకు రోజు రెండు గుడ్ల తో పాటు ప్రోటీన్ తో కూడిన డైట్ పేషెంట్లు చూసేందుకు వీలుగా టీవీలు ఏర్పాటు మెడికల్ టీం నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా సీసీటీవీ ఏర్పాట్లు అమ్మోనియం నైట్రేట్ నిర్వహణ విశాఖపట్నం పోర్టు ట్రస్టులో ఎరువుల గ్రేడ్ లో వినియోగించే అమోనియం నైట్రేట్ ను బ్యాగులో దిగుమతి చేసుకుంటారు చట్టపరమైన ఏజెన్సీ ల అనుమతుల తర్వాత మాత్రమే అమ్మోనియం నైట్రేట్ ను దిగుమతి చేసుకునేందుకు విశాఖపట్టణం పోర్ట్ ట్రస్టు అనుమతిస్తుంది. అమ్మోనియం నైట్రేట్ కు సంబంధించి విశాఖపట్టణం పోర్ట్ ట్రస్ట్ ఎటువంటి స్టోరేజి సదుపాయమ కల్పించదు. అమ్మోనియం నైట్రేట్ సంచులలో దిగుమతి అయిన, వెను వెంటనే సంబంధిత ఏజెంట్లు సరుకును అక్కడ నుంచి తరలించాలనే నిబంధన మేరకు అమోనియం నైట్రేట్ ను అనుమతించబడుతోంది విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ అమ్మోనియం నైట్రేట్ దిగుమతి చేసుకునే వారి కోసం 29 పాయింట్ల నిబంధన జాబితాను రూపొందించి దానిని తప్పని సరిగా అమలు చేయాలని దిగుమతి దారులకు నిబంధనలు విధించింది. అమ్మోనియం నైట్రేట్ దిగుమతి చేసుకునే సమయంలో అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు అమ్మోనియం నైట్రేట్ ను దిగుమతి చేసుకునే సమయంలో బెర్త్ మొత్తాన్ని కూడా పరిశు భ్రంగా ఉంచుతారు

### అభివృద్ధి ప్రాజెక్టులు

633 కోట్ల రూపాయలతో తో నిర్మిస్తున్న కంటైనర్ టెర్మినల్ విస్తరణ కార్యక్రమం పురోగతిలో ఉంది 2021 మార్చి నాటికి విస్తరణ కార్యక్రమం పూర్తి కావలసి ఉండగా కోవిడ్ 19 కారణంగా కొంత ఆలస్యం అవుతుంది ఈ విస్తరణ పూర్తయితే కంటైనర్ టెర్మినల్ అదనంగా మరో 5.4 లక్షల TEUs రవాణా చేయనుంది.

168 కోట్ల రూపాయలతో చేపట్టిన OR 1 మరియు OR 2 బెర్తుల అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి ఈ బెర్తుల ఆధునీకరణ వల్ల అదనంగా ఆయిల్ హ్యాండిల్ చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది 2022 మార్చి నాటికి ఆధునికీకరణ పనులు పూర్తవుతాయి ఆధునికీకరణ పూర్తయితే ఈ టెర్మినల్ ద్వారా 80 వేల టన్నుల సామర్థ్యం ఉన్న ఆయిల్ ట్యాంకర్లను నిర్వహించే వీలు కలుగుతుంది 2021 జనవరి నాటికి వెస్ట్ క్యూ7 అండ్ 8 బెర్త్ ల పైన లైసెన్సింగ్ విధానంలో వంద టన్నుల సామర్థ్యం కలిగిన రెండు హెచ్ ఎం సి ఏ క్రేన్ ఏర్పాటు. 2021 ఫిబ్రవరి నాటికి ఈక్యూ 3, ఈక్యూ 4 బెర్త్ లపై మరో రెండు, వంద టన్నుల కెపాసిటీ కలిగిన హెచ్ ఎం సి ఏ క్రేన్ ల ఏర్పాటు భారీగా సరుకు ను నిల్వ చేసేందుకు విడతల వారీగా కవర్డ్ స్టోరేజ్ షెడ్స్ నిర్మాణం. తొలివిడతలో అభివృద్ధి చేయనున్న కబోర్డు స్టోరేజీ షెడ్ కోసం 36 కోట్లు కేటాయింపు. ఇది 2021నాటికి పూర్తవుతుంది.

రెండు వందల ఎనభై నుంచి 300 కోట్ల రూపాయలతో వెస్ట్ క్యూ7,8 బెర్త్ ల యాంత్రీకరణ

### ఈ క్యూ 7 బెర్తు యాంత్రీకరణ

77 కోట్ల రూపాయలతో క్రూయిజ్యా టెర్మినల్ అభివృద్ధికి చర్యలు 180 కోట్ల రూపాయలతో సి హార్స్ జంక్షన్ నుంచి డాక్టర్ ఏరియా వరకు నాలుగు కిలోమీటర్ల పొడవైన ఫ్లైఓవర్ అభివృద్ధికి చర్యలు. డీపీఆర్ తయారీ దశలో ఉంది 110 కోట్ల రూపాయలతో ఈస్ట్ బ్రేక్ వాటర్ నుంచి చి నాలుగు లైన్ల కనెక్టివిటీ రహదారి అభివృద్ధికి డి పి ఆర్ తయారీ దశ మేజర్ స్పోర్ట్స్ అథారిటీ బిల్ మేజర్ పోర్టు అథారిటీ బిల్లు 2020 స్వాగతించదగినది. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తమ ఆస్తులను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు పోర్టులకు మంచి అవకాశం కల్పిస్తోంది పెట్టుబడి ఖర్చులను లేదా నిర్వహణా మూల ధన అవసరాల కోసం పోర్టు సెక్యూరిటీలను ద్వారా జాతీయ బ్యాంకుల నుంచి బహిరంగ మార్కెట్లో దేశంలోపల లేదా వెలుపల లోన్లు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది కస్టమర్లకు సంతృప్తికరమైన సేవలను అందించేందుకు పోర్టు లకు అవకాశం కల్పిస్తుంది. ఈ బిల్లు పోర్టులతో పాటు అక్కడ నిర్వహించే ప్రైవేటు టెర్మినల్స్ నిర్వాహకులకు కూడా మేలు కల్పిస్తుంది దేశంలోని నాన్ మేజర్ పోర్టులతో సమర్థవంతంగా పోటీ పడేందుకు ప్రభుత్వ రంగ పోర్టులకు మంచి బలాన్నిస్తుంది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రాయితీలు ఇచ్చేందుకు వెసలుబాటు కలుగుతుంది.

### కాలుష్య నివారణ కోసం పోర్టు తీసుకుంటున్న చర్యలు..

బొగ్గు ఇనుము వంటి కార్గో హ్యాండ్లింగ్ ను పూర్తిగా యాంత్రీకరణ చేయడం కోసం పిపిపి మోడ్ లో 2 వేల కోట్ల రూపాయలు ఇప్పటి వరకూ ఖర్చు చేసింది.

నిల్వ కేంద్రాల చుట్టూ గ్రీన్ బెల్ట్ అభివృద్ధి. మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తోంది.గత మూడేళ్లలో పచ్చ దనాన్ని పెంపొందించేందుకు 10.50 కోట్ల రూపాయలతో ఇప్పటి వరకూ 4 లక్షల 50 వేల మొక్కలను పెంచారు. ఈ ఏడాది 2020బి21 కి 1.02 లక్షల మొక్కలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. హుదుద్ సమయంలో విశాఖలో పచ్చదనం పూర్తిగా కనుమరుగు అయినది. తిరిగి పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రీన్ విశాఖలో భాగంగా పోర్ట్ కు 5.65 లక్షల మొక్కలను జిల్లా యంత్రాంగం కేటాయించింది. ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖతో కలిసి 2.30 కోట్ల రూపాయలతో 2 లక్షల మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని పోర్ట్ కనసాగిస్తున్నారు. పోర్ట్ స్టాక్ యార్డ్ లలోని బొగ్గు నిల్వలపై టార్ఫలిన్ కవర్లను కప్పి ఉంచుతున్నారు. వీటి నిర్వహణను పోర్ట్ యాజమాన్యం నిరంతరం పర్యవేక్షిస్తుంది. యాంత్రీకరణ ద్వారా ధూళిని గాలిలోకి ఎగరకుండా చేసేందుకు బొగ్గు నిల్వలపై నిరంతరం నీటిని చిమ్మే విధానాన్ని కొనసాగిస్తున్నారు. 10 ఎంఎల్ డి నీటి శుద్ధి ప్లాంట్ ద్వారా పోర్టు కు అవసరమైన నీటి అవసరాలను తీర్చుతున్నారు. పోర్టు పరిసర ప్రాంతాల్లో దుమ్ము ధూళీ ఎగరకుండా నిత్యం ఈ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన నీటిని రోడ్లపై చిలకరించి కాలుష్య నివారణ చర్యలను కొనసాగిస్తున్నారు. వేసవిలో ధూళి నగరంపైకి విస్తరించకుండా రోజుకు 250 టాంకర్లతో ప్రత్యేకంగా దుమ్మును నివారించేందుకు వినియోగిస్తున్నారు.

నిల్వ కేంద్రాల నుంచి దుమ్ము ధూళి నగరంపైకి ఎగర కుండా నిల్వ కేంద్రాల చుట్టూ 24 కోట్ల రూపాయలతో కాన్వేంట్ జంక్షన్ నుంచి హెచ్ 8 జంక్షన్ వరకూ 4.2 కిలోమీటర్ల వరకూ 11.5 మీటర్ల ఎత్తైన గోడను నిర్మించారు. 85 లక్షల వ్యయంతో ట్రక్ టైర్ వాషింగ్ సౌకర్యాన్ని కల్పించారు.బెర్త్ ల వద్ద లోడింగ్ అన్ లోడింగ్ జరుగుతున్న సమయంలో ధూళి ఎగర కుండా 85 లక్షల విలువైన రెండు ఫాగ్ కెనాన్స్ వినియోగిస్తున్నారు. రోడ్డుపై నున్న దుమ్మును ఊడవడానికి యాంత్రీకరణ స్వీపింగ్ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు. 2016లో సుమారుప 60 కోట్ల రూపాయలతో 10 ఎం డబ్యూ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం. 190 కేవీ రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు . దీని ద్వారా ఉత్పత్తి అయ్యే 12 మిలియన్ యూనిట్ల విద్యుత్ లో 7.40 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను పోర్టు తన సొంత అవసరాలకు వినియోగించు కోవడమే కాకుండా మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు అనుసంధానం చేసి తద్వారా ఆదాయాన్ని సైతం పొందుతోంది. సోలార్ విద్యుత్ ఉత్పత్తితో పోర్టు తనకు కావలసిన 100 శాతం విద్యుత్ ను వినియోగించుకుంటోంది.

# భూ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

## - డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



పోలాకి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రానున్న జనవరి నుంచి చేపట్టనున్న భూ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర రెవిన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మాబగం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి పి వేణుగోపాలరావు, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. కాళీ ప్రసాద్ పలువురు తాసిల్దార్లు మంగళవారం ఉదయం డిప్యూటీ సీఎం కృష్ణ దాస్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో సమగ్ర భూ సర్వే, కాస్ట్ టెక్నాలజీ, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వారంతా డిప్యూటీ సీఎం ధర్మానను సత్కరించారు.

# నన్నయ సెట్ కు 9వ తేది వరకు తత్కాల్ దరఖాస్తు

కాకినాడ : కోవిడ్ కారణాలతో నన్నయ సెట్ 2020 కి దరఖాస్తు చేసుకొనని విద్యార్థులకు విశ్వవిద్యాలయం తత్కాల్ లో రూ.2000 ఫీజుతో దరఖాస్తు చేసుకొనేందుకు ప్రత్యేకంగా అవకాశం కల్పించిందని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా.డి.జ్యోతి ర్మయి తెలిపారు. విశ్వ విద్యాలయంలో మంగళవారం ఆమె దీనికి సంబంధించిన ఒక ప్రకటన విడుదల చేసారు. నన్నయ సెట్ 2020 కి దరఖాస్తు చేసుకొనేందుకు చివరి సారిగా అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ నెల 16వ తేది నుండి నన్నయ సెట్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. కాబట్టి ఈ చివరి అవకాశాన్ని అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవచ్చు నని తెలియజేశారు.

# కోవిడ్ జాగ్రత్తలతో ఎస్డీఐలో పునఃప్రారంభమైన నైపుణ్య శిక్షణ




ఆరిలోవ : కరోనా దృష్ట్యా లాక్ డౌన్ కారణంగా గత ఆరు నెలలుగా ఆగిపోయిన నైపుణ్య శిక్షణను అన్ లాక్-4 ప్రక్రియలో భాగంగా భారత ప్రభుత్వంవారి విధి విధానాలను అనుసరించి అన్ని నిబంధనలను పాటిస్తూ దీనదయాళపురంలోని స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ వారు నాడు ప్రారంభించారు.

ఈ సందర్భంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వారితో కుదుర్చుకున్న అవగాహన ప్రకారం "కష్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్" కోర్సును స్టీల్ ప్లాంట్ పర్సనల్ డైరెక్టర్ కిషోర్ చంద్ర దాస్ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ముందుగా ఎస్డీఐ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నగేష్ మాట్లాడుతూ గడచిన 4 సంవత్సరాలలో ఎస్డీఐ పదకొండు వేలమంది గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత భోజన వసతితో కూడిన గుణాత్మక శిక్షణ ఇచ్చి 75% మందికి ఉపాధి అవకాశాలు చూపినట్లు తెలిపారు. కొన్ని లక్షలు వెచ్చించి కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి వీలున్న అన్ని ముందు జాగ్రత్త చర్యలని తీసుకుని సురక్షిత వాతావరణంలో రెండు కోర్సులతో 60 మంది అభ్యర్థులతో తిరిగి శిక్షణ ప్రారంభించామని అన్నారు. స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ మాట్లాడుతూ యువతకు మార్గదర్శులుగా స్టీల్ ప్లాంట్, హెచ్పీసీఎల్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు నిలుస్తున్నాయని, దీనిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని, వైరస్ పట్ల అప్రమత్తతో వుంటూనే సాధారణ జీవనం కొనసాగించాల్సిన అవసరం వుందని అన్నారు.

అతి కొద్ది కాలంలోనే అద్వితీయ సేవలతో ఎన్నో పురస్కారాలను కూడా స్వంతంచేసుకున్న ఎస్డీఐ లాంటి అత్యుత్తమ సంస్థలతో భాగస్వాములు కావడం ఆనందంగా వుందని హర్షం వ్యక్తం చేశారు.

వర్చ్యువల్ విధానంలో హెచ్పీసీఎల్ మానవ వనరుల నిర్దేశకుడు పుష్ప కుమార్ జోషీ పాల్గొని, శిక్షణార్థులకు కోవిడ్ జాగ్రత్తలతో కూడిన శుభాకాంక్షలు అందజేశారు. ఆర్వీ రావు, సత్యనారాయణ, నవ్య, నరసింహ దాసు, మహేష్, శ్రీనివాస్, కిరణ్ లతో పాటు 800 మంది విద్యార్థులు, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో తీసిన కొన్ని చిత్రాలను జతపరచు చున్నాము.



# జిల్లా పరిషత్ లో ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలతో సమావేశం



శ్రీకాకుళం : ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం కరోనా వ్యాధిగ్రస్థులు వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, ప్రభుత్వ విధి విధానాలు అనుసరించి మాత్రమే ఫీజులు వసూలు చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. ఏ హాస్పిటల్ ఎంత వసూలు చేస్తున్నారో వాటి వివరాలు కొంత మేర ఉన్నాయని పేర్కొంటూ ఇక ముందు ప్రభుత్వ విధి విధానాలను అనుసరించి వైద్యం చెయ్యాలని ఏమైనా ఇబ్బందు లుంటే సరి చేస్తానని చెప్పారు.

ఈ సమావేశంలో యూనిక్ హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ చింతాడ భాస్కరరావు మాట్లాడుతూ కొన్నిసార్లు కోవిడ్ వ్యాధిగ్రస్తులు జాయిన్ అయినపుడు ఎంత ఖర్చు అయినా పర్వలేదు. ఏ టెస్టులు చేసినా పర్వలేదు అని జాయిన్ అయ్యి బిల్లు చెల్లింపు సమయంలో రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వివిధ వర్గాల జ్యోక్యం కూడా జరుగుతుందని, మేము వీటన్నిటి వలన ఇబ్బందులు పడుతున్నామని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం తరపున అన్నారు.

ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ చంద్రానాయక్, ఆడిషనల్ డిఎంహెచ్ఓ బగాది జగన్నాథ రావు, డాక్టర్ కొయ్యాన అప్పారావు, ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాలంలో చిన్నారుల చర్మాన్ని మృదువుగా ఉంచండి

విశాఖపట్నం : వర్షాకాలం చిన్నారుల్లో చర్మపు సమస్యలైన దద్దులు, దురద పెట్టడం తదితర సమస్యలను తీసుకువస్తుంది. వర్షాకాలంలో బాలల చర్మ సంరక్షణకు తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి హిమాలయ డ్రగ్ కంపెనీ ఆర్డి విభాగంలోని ఆయుర్వేద నిపుణురాలు డా.ప్రతిభ దీని గురించి మాట్లాడుతూ చర్మపు తేమ మరియు పోషకాంశాలతో కూడి ఉండేందుకు కాలి వేళ్ల నుంచి జుట్టు కుదుళ్ల వరకు వర్షాకాలం ఆరోగ్యంతో కూడిన అలవాట్లను మృదువైన సురక్షిత ఉత్పత్తులను ఉపయోగించుకోవడం ఉత్తమం. ఆలివ్ నూనె మరియు ఆల్మండ్ నూనెను కలిసి ఉన్న సబ్బును ఎంపిక చేసుకోండి. ఉత్తమమైన స్కిన్ సాఫ్ట్ నర్ బిడ్డ చర్మాన్ని తేమగా ఉంచి, పొడి బారకుండా చూస్తుంది మరియు ఆలివ్ నూనె చర్మానికి పోషణ అందించడమే కాకుండా ఎండిపోకుండా రక్షిస్తుంది. స్నానం అనంతరం చర్మంపై ముడుతలు ఉండే బుగ్గలు, గొంతు, గడ్డం మరియు మోకాళ్లను మృదువుగా తడిలేకుండా శుభ్రం చేసుకోండి. వన మూలికలతో సమృద్ధమైన బేబీ పౌడర్ను ఉపయోగించండి. సూక్ష్మజీవుల నిరోధక గుణాలకు మరో పేరైన వెటివర్ చర్మపు దద్దులను తక్కువ చేసేందుకు సహకరిస్తుంది మరియు బిడ్డ చర్మనాన్ని చల్లగా అలానే సరికొత్తగా ఉంచేలా చేస్తుందని' వివరించారు. వర్షాకాలంలో మాడుపై దురద మరియు క్రాడల్ క్యాప్ సమస్యకు మృదువైన మందార మరియు శెనగతో చేసిన బేబీ షాంపూను ఉపయోగించడం ద్వారా వనమూలికలు మార్గాన్ని అనుసరించవచ్చు.

# మైనారిటీ విద్యార్థులకు ఐఎఎస్ అవగాహన సదస్సులు

## జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి యం.అన్నపూర్ణమ్మ

శ్రీకాకుళం : జిల్లాలోని పదవ తరగతి నుండి డిగ్రీ వరకు ఉత్తీర్ణులైన మైనారిటీ విద్యార్థినీ విద్యార్థులకు ఐఎఎస్/ఐపియస్ పై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మరియు వక్ఫ్ బోర్డు అదనపు శాఖాధికారి యం.అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

జిల్లాలోని మైనారిటీ విద్యార్థులకు ఐ.ఎ.ఎస్ మరియు ఐ.పి.ఎస్ లపై అవగాహన సదస్సులను ప్రతీ ఆదివారం నిర్వహించడం జరుగుతుందని, ఈ అవగాహన సదస్సులకు హాజరగు ఆసక్తి గల విద్యార్థులు https://forms.gle/Ex1 hhtrRFYMUKnig నకు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ సదస్సులకు పాల్గొనదలచిన అభ్యర్థులు తప్పనిసరిగా స్మార్ట్ ఫోన్ తీసుకురావాలని, ఎంపికైన 100 మంది విద్యార్థులకు ఒక్కొక్క బ్యాచ్ ద్వారా ప్రతీ వెబినార్ ద్వారా అవగాహన సదస్సులను నిర్వహించడం జరుగుతుందని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ అవకాశం ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇతర వివరాల కొరకు షేక్ నాసిర్, 94900 44933 లేదా రియాజ్, 99890 84099 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆమె ఆ ప్రకటనలో స్పష్టం చేసారు.

# నాడు నేడు పనులను తనిఖీ చేసిన కలెక్టర్



శ్రీకాకుళం : జలుమూరు మండలంలో నాడు నేడు పనులను జిల్లా కలెక్టర్ జె నివాస్ తనిఖీ చేసారు. లింగాలవలస, అచ్యుతాపురం, శ్రీముఖలింగం పాఠశాలలో నాడు నేడు పనుల నాణ్యతను పరిశీలించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు పక్కాగా ఉండాలన్నారు. భవిష్యత్తులో నిరంతర నీటి సరఫరా, ఇతర నిర్వహణ పనులకు ఎటువంటి సమస్య లేకుండా ముందుగానే పక్కా ప్రణాళికలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలకు గ్రానైట్ ను ఫ్లోరింగు కోసం వినియోగించాలని సూచిస్తూ పనుల సమయంలో గ్రానైట్ ఫ్లోరింగుపై ఎటువంటి సున్నపు మరకలు లేదా ఇతర మరకలు పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల తలుపులు, గడియలను స్వయంగా పరిశీలించి వాటి నాణ్యతపై నిర్ధారణకు వచ్చారు. నాడు నేడు పనులతో పాఠశాలలు ఆహ్లాదకరంగా మారుతున్నాయని పేర్కొంటూ ప్రతి పాఠశాలపై చిన్నారులకు ఆకట్టుకునే విధంగా, సృజనాత్మక ఆలోచనలు రేకెత్తించే విధంగా చిత్రాలు ఉండాలని సూచించారు. ప్రతి చిత్రం వారిలో నిఘూడంగా ఉన్న సృజనాత్మక శక్తి వెలికితీయుటకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేదని ఆయన స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి కె.చంద్రకళ, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి పి.వి.రమణ, కార్యనిర్వాహక ఇంజనీరు వి.వెంకట కృష్ణయ్య, మండల విద్యా శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్లోనూ నమోదుకు అవకాశం



**- ఓటరు నమోదు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు వెల్లడి**

**- ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశం**

కాకినాడ : తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి ప్రస్తుతం ఓటర్ల జాబితా రూపకల్పనకు కసరత్తు జరుగుతోందని ఓటరు నమోదు అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) సీహెచ్ సత్తిబాబు తెలిపారు. ఆయన మంగళవారం కలెక్టరేట్లో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తగిన అర్హతలున్నవారు ఈసారి ఆఫ్లైన్తో పాటు ఆన్లైన్లోనూ ఓటరుగా నమోదుచేసుకోవచ్చని డీఆర్వో వివరించారు. https://ceoandhra.nic.in/ceoap_ new/ceo/index.html ద్వారా ఫార్మ్-19ను పూరించవచ్చని తెలిపారు. నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫొటోతో పాటు అవసరమైన ధ్రువీకరణపత్రాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. 2014, నవంబర్ 1 నుంచి 2020, నవంబర్ 1 వరకు ఆరేళ్ల కాలంలో కనీసం మూడేళ్ల పాటు గుర్తించిన విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు ఓటరుగా నమోదుకు అర్హులని తెలిపారు. పార్ట్ టైమ్ ఉపాధ్యాయులు ఓటరుగా నమోదుకు అనర్హులని చెప్పారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జీపీఎఫ్/ఈపీఎఫ్ ఖాతా నంబరును సమర్పించాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 1న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, ఆపై డిసెంబర్ 31 వరకు అభ్యంతరాలను స్వీకరించి, 2021, జనవరి 18న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఈవో ఎస్.అబ్రహాం, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ఎం.జగన్నాథంతో పాటు ఎస్జీటీఎఫ్, ఎస్టీయూ, పీఆర్టీయూ, యూటీఎఫ్, వైఎస్సార్ టీఎఫ్, బీటీఏ, ఏపీటీఎఫ్, హెచ్ఎంల అసోసియేషన్, ఆర్యూపీపీ, ఏపీటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**వెబినార్లో పాల్గొన్న డీఆర్వో:** జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక (డీడీఎంపీ) రూపకల్పనపై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఐడీఎం-న్యూఢిల్లీ) మంగళవారం వెబినార్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఆన్లైన్ శిక్షణ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పాల్గొన్నారు. నిర్దేశ ప్రమాణాలకు అనుగుణంగా తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపకల్పన జరుగుతుందని డీఆర్వో తెలిపారు.

# నన్నయ డిగ్రీ, పీజీ పరీక్షలు టైంటేబుల్ను విడుదల చేసిన వీసీ జగన్నాథరావు



భాస్కరరామ్ ను సన్మానించిన వీసీ జగన్నాథరావు

కాకినాడ : ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్లు మరియు పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేసారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన వివరాలను వీసీ వెల్లడించారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ ఫైనల్ పరీక్షలు ప్రశాంత నిర్వహించి విజయవంతంగా ముగించామని అన్నారు. దీనిలో భాగంగా డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు మరియు పీజీ, ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ రెండవ సెమిస్టర్ పరీక్షలు మరియు ఎంసిఏ నాలుగవ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించేందుకు టైంటేబుల్ ను రూపొం దించాన్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించే విధంగా పక్కా ప్రణాళికను సిద్ధం చేసామని చెప్పారు. డిగ్రీ ఫోర్త్ సెమిస్టర్ పరీక్షలు అక్టోబర్ 20వ తేది నుండి నవంబర్ 3వ తేది వరకు ఉదయం సైన్స్ విద్యార్థులకు, మధ్యాహ్నం ఆర్ట్స్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. అలాగే డిగ్రీ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు నంబర్ 4 నుండి 17వ తేది వరకు ఉదయం సైన్స్ విద్యార్థులకు మధ్యాహ్నం ఆర్ట్స్ విద్యార్థులకు జరుగుతాయని చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని 114 పరీక్షా కేంద్రాలలో 69159 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తారని తెలిపారు. పీజీ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు ఆర్ట్స్ విద్యార్థులకు ఈ నెల 26 నుండి నవంబర్ 3వ తేది వరకు జరుగుతాయని, సైన్స్ విద్యార్థులకు నవంబర్ 5 నుండి 10 వరకు జరుగుతాయని, ఎంసిఏ ఫోర్త్ సెమిస్టర్ పరీక్షలు నవంబర్ 11 నుండి 17 వరకు జరుగుతాయని అన్నారు. 24 పరీక్షా కేంద్రాలలో 6170 మంది విద్యార్థులు ప్రతీ రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. బిఈడీ, బి.పి.ఈడీ, డిపిఈడీ పరీక్షలు ఈ నెల 20వ తేది నుండి 23వ తేది వరకు 14 పరీక్ష కేంద్రాలలో జరుగుతాయని చెప్పారు.

**నన్నయ వీసీని కలిసిన భాస్కరరామ్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి మరియు ప్రముఖ ఆడిటర్ వి.భాస్కరరామ్ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును మర్యాదపూర్వకంగా కలిసారు. భాస్కరరామ్ 2017-19వ సంవత్సరంలో విశ్వవిద్యాలయంలో ఎంఎ సైకాలజీ చేసారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం వీసీ మొక్కా జన్నాథరావును కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాలకు విద్యా కేంద్రంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత గోదావరి జిల్లా వాసుల అందరిపై ఉందని అన్నారు.

# నష్టాలలో ఉన్న చక్కెర కర్మాగారాలు పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు

- తాండవ చక్కెర కర్మాగారానికి రూ.9 కోట్లు, ఏటికొప్పాకకు రూ.7 కోట్లు
- చెఱకు పంటను ఎన్ఆర్ఇజియస్ కు అనుసంధానం చేయాలని కోరిన రైతులు

చక్కెర కర్మాగారాలను పరిశీలించిన రాష్ట్ర మంత్రి వర్గ సబ్ కమిటీ









విశాఖపట్నం : రాష్ట్రంలో నష్టాలలో ఉన్న 12 సహకార చక్కెర కర్మాగాలను పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖామాత్యులు, రాష్ట్ర మంత్రి వర్గ సబ్ కమిటి సభ్యులు బొత్స సత్యనారాయణ వెల్లడించారు. జిల్లాలోని తాండవ, ఏటికొప్పాక సహకార చక్కెర కర్మాగారాలను ఉప సంఘం మంగళవారం సందర్శించి అక్కడి రైతులు, కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండవ, ఏటికొప్పాక సహకార చక్కెర కర్మాగారాలను సందర్శించి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ఈ ప్రభుత్వం చెల్లిస్తుందని, ఇందులో తాండవ ఫ్యాక్టరీకి 9 కోట్ల రూపాయలు, ఏటికొప్పాక ఫ్యాక్టరీకి 7 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించి కర్మాగారాలను పునరుద్ధరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు ఆయన వివరించారు. కర్మాగారాలకు పూర్వవైభవం తీసుకురావడానికి కార్మికులు, రైతులు భాగస్వాములవ్వాలన్నారు. ఒక లక్షా పది వేల టన్నులు చెఱకు ఆడే కర్మాగారం 64 వేల టన్నులకు పడిపోవడానికి కారణం గత ప్రభుత్వం సకాలంలో చెల్లింపులు చేయకపోవడమేనని తెలిపారు. రైతులు పంటను తిరిగి యధా స్థితిలో పండించి ఫ్యాక్టరీని నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. కర్మాగారం పనిచేయడం వలన అనుబంధ పరిశ్రమలు, వారి కుటుంబాలు లబ్దిపొందుతాయన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ, మంత్రి, రాష్ట్ర మంత్రి వర్గ సబ్ కమిటి సభ్యులు కురసాల కన్నబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలనే ఈ కర్మాగాలు మూతపడ్డాయని, సహకార చక్కెర కర్మాగారాలను పరశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, మంత్రి వర్గ సబ్ కమిటి సభ్యులు మేకపాటి గౌతంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 12 పరిశ్రమలకు అవసరమైన నిధులు ప్రభుత్వం సమకూర్చి తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. లాభనష్టాలతో ప్రమేయం లేకుండా చెరకు రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. 12 చక్కెర కర్మాగారాలను కాపాడుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, రాష్ట్ర మంత్రి వర్గ సబ్ కమిటి సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి మూతపడిన పరిశ్రమలను తిరిగి ప్రారంభించడానికి చిత్తశుద్ధితో ఉన్నారని, ప్రారంభించడమే కాని మూసివేయడం ఉండదన్నారు. రాష్ట్రంలో 12 పరిశ్రమలకు అవసరమైన నిధులు ప్రభుత్వం సమకూర్చి తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నష్టాలలో ఉన్న కర్మాగారాలపై సబ్ కమిటీ వేశారని చెప్పారు. కర్మాగారాలను తిరిగి ప్రారంభించడానికి రైతులు, కార్మికుల నుండి సూచనలు, సలహాలు తీసుకొని ప్రభుత్వానికి నివేధిక రూపంలో సమర్పిస్తామన్నారు. కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీత మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా నుండి రెండు కర్మాగారాలను మూసివేయడమైనదని, ఆ ప్రాంతంలో పండించే చెఱకును తాండవ సహకార చక్కెర కర్మాగారం వారు తీసుకొనుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తుని నియోజకవర్గ శాసన సభ్యులు దాడిశెట్టి రాజా, పత్తిపాడు శాసన సభ్యులు హరిచంద్ పూర్ణ ప్రసాద్, పాయకరావు పేట, అనకాపల్లి, నర్సీపట్నం శాసన సభ్యులు గొల్ల బాబురావు, గుడివాడ అమర్ నాథ్, ఉమా శంకర గణేష్లు మాట్లాడుతూ సహకార చక్కెర కర్మాగారాలు నడిపించి రైతులను ఆదుకోవాలని కోరారు. కర్మాగారం కార్మికులు మాట్లాడుతూ కర్మాగారం ప్రారంభించడానికి తమవంతు సహకార అందిస్తామని, కర్మాగారం తెరిపించాలని కోరారు. కర్మాగారం నిర్వహణ చేయడానికి అవసరమైన నిధులు సమకూర్చాలని కోరారు. రైతులు మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించాలని, ఎన్.ఆర్.ఇ.జి.యస్. పథకానికి చెఱకు పంట సాగు అనుసంధానం చేయాలని కోరారు. ఇథనాల్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని, ఉత్పత్తి అయిన చక్కెరకు మార్కెటింగ్ కల్పించాలన్నారు. చెఱకు పంటకు కోతుల బెడద చాలా ఎక్కువగా ఉన్నదని, వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారాపురెడ్డి మౌర్య, తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పండగ సీజన్ సందర్భంగా గృహ, కార్ల రుణాలపై వడ్డీ రేటు, ప్రాసెసింగ్ రుసుముల మాఫీని ప్రకటించిన బ్యాంక్ ఆఫ్ బరోడా



హైదరాబాద్ : భారతదేశ మూడో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్.. బ్యాంక్ ఆఫ్ బరోడా రానున్న పండగల సందర్భంగా రిటైల్ రుణ ఆఫర్ లని ప్రకటించింది. ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా అందిస్తున్న వడ్డీ రేట్లపై 0.25 శాతం వడ్డీ రేటు తగ్గింపును ప్రకటించింది. ఈ ఆఫర్ బ్యాంక్ ఆఫ్ బరోడా గృహ రుణాలు(టేక్ ఓవర్ కేసులు మాత్రమే) మరియు కారు రుణాలకు వర్తిస్తుంది. వడ్డీ రేటు తగ్గింపునకు అదనంగా, ప్రాసెసింగ్ రుసుములని రద్దు చేసింది.

"ఈ పండగ్ సీజన్ సందర్భంగా ప్రకటించిన రిటైల్ రుణాల ఆఫర్ లని బ్యాంక్ ఆఫ్ బరోడా నమ్మకమైన వినియోగదారులతో పాటు నూతన వినియోగదారులు కారు రుణాలు తీసుకునేందుకు మరియు గృహ రుణాల్ని బ్యాంక్ ఆఫ్ బరోడాకు మార్చుకునేందుకు బహుమతిగా అందజేస్తున్నామని, ఈ ఆఫర్ తో తక్కువ వడ్డీ రేటు, ప్రాసెసింగ్ రుసుము రద్దుతో వినియోగదారులు లబ్ది పొందాలని' బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోనల్ మెనేజరు శ్రీ పి శ్రీనివాస్ తెలిపారు.

## నేడు విజయవాడకు నిర్మలా సీతారామన్..

విజయవాడ : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రేపు (బుధవారం) విజయవాడలో పర్యటించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 12.25 నిమిషాలకు చెన్నై నుంచి హైదరాబాద్.. అక్కడ నుంచి గన్నవరం విమానాశ్రయానికి కేంద్ర మంత్రి చేరుకోనున్నారు.

గన్నవరం నియోజకవర్గంలోని జక్కుల, నెక్కలం, గూడవల్లి సర్కిల్ వద్ద వ్యవసాయ క్షేత్రంలో నేరుగా రైతులను కలిసి మాట్లాడనున్నారు. అనంతరం నేరుగా విడిది గృహానికి చేరుకొని 3.00 గంటలకు కేంద్ర ప్రభుత్వ అధికార కార్యక్రమంలో ఆమె పాల్గొనున్నారు.

## 8న 'కృష్ణా'లో జగనన్న విద్యాకానుక ప్రారంభం



విజయవాడ: జగనన్న విద్యాకానుక పథకాన్ని ఈ నెల 8న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృష్ణా జిల్లా పునాదిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభిస్తారని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. 'జగనన్న విద్యా కానుక ద్వారా 40 లక్షల మందికి పైగా విద్యార్థులకి లబ్ది చేకూరుతుంది. జగనన్న విద్యాకానుక పథకానికి సుమారు 650 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నాం. విద్యార్థులకు ఇచ్చే ఈ కిట్‌లో యూనిఫారం, పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూలు బ్యాగ్ ఇలా వివిధ రకాల వస్తువులని అందిస్తున్నాము. రాష్ట్రంలో విద్యాశాఖకి సీఎం వైఎస్ జగన్ అత్యంత ప్రాధాన్యతనిచ్చి జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, నాడు-నేడు ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విద్యాశాఖలో సంక్షేమ పథకాల ద్వారా డ్రాప్ అవుట్స్‌ని తగ్గించడం, ప్రాథమిక స్థాయి నుంచే అత్యుత్తమ విద్యని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. విద్యా శాఖలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో 2.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ స్కూళ్లల్లో చేరారు.

## రైతు సంక్షేమమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



పోలాకి : రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన మంగళవారం మబగంలో రైతులకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, టాటా రేలిస్ ఉత్పత్తి చేసిన క్రిమినాశిని మందులను ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు.

ఈ కార్యక్రమంలో కోరమండల్ ఉత్పత్తి చేసిన వాడా మైనను, టాటా రేలి వారి బెఫ్రిఫ్యూజన్ మందులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జెడి కె శ్రీధర్, ని రాబర్ట్ పాల్, ఏడి కె రవీంద్ర భారతి, ఏడి (సెరికల్చర్) పి బాలకృష్ణారావు, మండల వ్యవసాయాధికారి కెసిహెచ్ వెంకటరావు, కోరమండల్ జిల్లా ప్రతినిధి కిషోర్ వర్మ, ప్రతినిధులు మోహన్, సత్యనారాయణ, టాటా రేలిస్ ప్రతినిధి కృష్ణప్రసాద్, విఎఎ బి రోజారత్నం తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ లో మెరుగైన ర్యాంకు కొరకు ప్రజా ఆరోగ్య అధికారులు కృషిచేయాలి

- జివిఎంసి కమిషనర్ డా. జి.సృజన




విశాఖపట్నం : వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు నిబద్ధతతో పనిచేయాలని జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన స్పష్టం చేసారు. మంగళవారం వి ఎం ఆర్ డి ఏ చిల్డ్రెన్ థియేటర్ లో వార్డు సెక్రటరేట్ లతో సమావేశం ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2021లో విశాఖపట్నంను స్వచ్ఛ సర్వేక్షణ్ లో మొదటిస్థానంలో నిలబెట్టడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఒక విప్లవాత్మకమైన మార్పుకోసం వార్డు సెక్రటరేట్ వ్యవస్థను స్థాపించారని, దాని లక్ష్య సాధనకోసం మనం అందరం క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ప్రతీ వార్డు సచివాలయ ఉద్యోగి వద్ద తప్పని సరిగా వార్డు యొక్క వివరాలు ఉండాలన్నారు. ప్రతి వార్డు సెక్రటరి సచివాలయం లేదా వార్డు పరిధిలో తప్పని సరిగా నివాసముండాలన్నారు. ప్రతీ రోజూ ఉదయం 10.00 గం. ల లోపు కాలువలు రోడ్డు క్లీనింగ్ అవ్వాలని, డస్ట్ బిన్స్ 10.30గం. ల లోపు క్లీన్ అవ్వాలన్నారు. ప్రతీ రోజూ ఎదో ఒక అధికారి సచివాలయాలను సందర్శిస్థారని, మీ యొక్క హాజరు, మూమెంట్ రిజిస్టర్ ను విధిగా చూపాలన్నారు. మీరు సెలవు పెట్టదలచిన యెడల మీ సెలవు చీటీను శానిటరి ఇన్స్పెక్టర్ నకు ఇవ్వాలన్నారు. మీ వార్డు పరిధిలో ప్రతి ఇంటినుండి డోర్ టు డోర్ తడి చెత్త - పొడి చెత్త ను వేరుచేసి తీసుకోవాలన్నారు. ప్రతీ వాణిజ్య దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు వసూలు చేయాలన్నారు. అలాగే రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ లతోకలసి మీరు పనిచేయాలన్నారు. రోడ్డుపై చెత్త, బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ వెస్తే వారికి జరిమానా విధించాలన్నారు. ప్రతి వార్డు సెక్రటరీలు అడిగిన తమ సందేహాలను కమిషనర్ నివృత్తి చేసారు.

ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున, ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు.జివిఎంసి అదనపు కమిషనర్ డా. వి. సన్యాసి రావు మాట్లాడుతూ విశాఖపట్నంను స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఉన్నత ర్యాంకుకు కావలసిన కార్యచరణ ప్రణాళికను పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనరు డా. వి.సన్యాసి రావు, సి.ఎం.ఓ.హెచ్. డా. కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, ఏ.ఎం.ఓ.హెచ్. లు, శానిటరీ సూపెర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు ప్రత్యేక అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com